ఈనాడు తిరుపతి

గురువారం సెప్టెంబరు 26, 2024 5

కొలువైన పోలేరమ్మ తల్లి



కళ్లు ఏర్పాటు తర్వాత భక్తుల దర్శనార్థం అమ్మవారు

☛ పోటెత్తిన భక్తజనం

☛ ఆకర్షణగా బాణసంచా వెలుగులు

వెంకటగిరి, న్యూస్‌టుడే: గ్రామశక్తి పోలేరమ్మ జాతరలో కీలక ఘట్టమైన అమ్మవారి విగ్రహం తయారీ బుధవారం సాయంత్రానికి పూర్తయింది. అమ్మ పుట్టినిల్లయిన కుమ్మరివీధిలోని కుమ్మరింట అమ్మవారి ప్రతిమను తయారు చేశారు. కుమ్మరి కుటుంబీకులు పోలేరమ్మకు అమ్మగారి సాంగ్యం అందజేశారు. రాజాలు సమర్పించిన పట్టుచీరను అమ్మవారికి అలంకరించారు. విగ్రహం తయారీ పూర్తయ్యాక అమ్మవారిని దర్శించుకునేందుకు ఉంచారు. పోలేరమ్మ తల్లికి దిష్టి తగలకుండా ఉండేందుకు నష్ట మాలను పత్తి కుటుంబీకులు పోలేరమ్మ నుదుట కట్టారు. అనంతరం పోలేరమ్మను దర్శనం కోసం వెలుపల ఉంచారు. ఇక్కడ వేలాది మంది భక్తులు పోలేరమ్మను దర్శించుకున్నారు. అర్ధరాత్రి దాటిన తరువాత పోలేరమ్మను మెట్టినిల్లైన చాకలింటికి తీసుకువెళ్లి అక్కడ కనుగుడ్లు, దిష్టిచుక్క ఏర్పాటు చేసి కిలారింపులు, దివిటీ వెలుగులు, యువకులు చిందులు మధ్యన అమ్మవారిని చప్పరంపై ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చారు. ఇక్కడ భక్తుల దర్శనార్థం ఉంచారు. గురువారం సాయంత్రం వరకు భక్తులు పోలేరమ్మను దర్శించుకునేలా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. పట్టణంలోని బూసాతోటలో ప్రత్యేకంగా టపాసుల మోత కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రారంభించారు. అమ్మవారికి ప్రభుత్వం తరఫున పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సారె సమర్పించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జాతర నిర్వహణకు రూ.50 లక్షలు ప్రకటించింది.



ఆలయం వద్ద పూలాలంకరణ






విద్యుద్దీప కాంతుల్లో జెయింట్ వీల్

కల్పవృక్ష వాహనాయా.. సత్యప్రమాణాల దేవా



క్షీర కలశాలను ఊరేగింపుగా తెస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో గురుప్రసాద్, ఆలయ అధికారులు, సిబ్బంది





కల్పవృక్ష వాహన పల్లకీలో ఊరేగుతున్న వినాయకుడు ◗ సర్వాలంకృతులైన ఉత్సవమూర్తులు



కాణిపాకం, న్యూస్‌టుడే: ప్రత్యేకోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజైన బుధవారం ఉభయ దేవేరులతో కలిసి వరసిద్ధి వినాయక స్వామి వారు కల్పవృక్ష వాహనాన్ని అధిరోహించారు. భక్తులు స్వామివారి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకొని మంత్రముగ్ధులయ్యారు. ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, ఈవో గురుప్రసాద్, మాజీ ఛైర్మన్ మణినాయుడు, ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

తిరుమలకు నేతల వరుస

తిరుమల, న్యూస్‌టుడే: కల్తీ నెయ్యి వివాదాల నేపథ్యంలో తిరుమలలో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఈ క్రమంలో పలు పార్టీల నేతలు తిరుమల రానున్నారు. ఈ నెల 28న వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి తిరుమలకు కాలినడకన రానున్నట్లు సమాచారం. శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జరిగిన కల్తీకి ప్రాయశ్చిత్తంగా దీక్ష చేపట్టిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈనెల 1, 2న తిరుమలకు చేరుకుని దీక్షను విరమించనున్నారు.


● అక్టోబర్ 4న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల మొదటిరోజు సీఎం చంద్రబాబునాయుడు సతీసమేతంగా తిరుమల విచ్చేసి శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

సర్వదర్శనానికి 6 గంటలు

తిరుమల: ఎస్ఎస్‌డీ టోకెన్లు లేకుండా బుధవారం సాయంత్రానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులకు దాదాపు ఆరు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. మంగళవారం శ్రీవారిని 67,616 మంది దర్శించుకున్నారు. రూ.3.89 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

వీఐపీ బ్రేక్ టికెట్ల జారీలో అంతరాయం.. తితిదే వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లకు సంబంధించిన ఎస్ఎంఎస్ జారీకి బుధవారం రాత్రి కొద్దిసేపు అంతరాయం కలిగింది. అదనపు ఈవో కార్యాలయం చేరుకోవడంతో వారికి మాన్యువల్‌గా టికెట్ల సమాచారాన్ని అందించారు. అనంతరం భక్తులు ఎంబీసీ 34లో వీఐపీ బ్రేక్‌దర్శన టికెట్లు కొనుగోలు చేశారు. కొంతసేపటికి ఎస్ఎంఎస్‌ల జారీ పునఃప్రారంభమైంది.

మెప్మాసురులు



☛ పొదుపు మహిళకు దివాలా ముద్ర

☛ కొనసాగుతున్న సిబ్బంది ఆగడాలు

☛ ప్రస్తుత బదిలీల్లోనూ ఇక్కడే తిష్ట

● తిరుపతి ముత్యాలరెడ్డి ప్రాంతంలోని ఓ మురికివాడలో 20 మెప్మా సంఘాలు దివాలా తీశాయి. ఒక్కో సంఘం రూ.20 లక్షల వరకు బ్యాంకు లింకేజీ రుణం తీసుకుని తిరిగి చెల్లించడంలో విఫలమయ్యాయి. అందుకు కారణం ఓ ఆర్పీ సంఘాల పేరుతో రుణాలు తీసుకుని వాటిని కాజేసినట్లు రుజువైంది. రూ.30 లక్షల వరకు పక్కదారి పట్టిన విషయం వెలుగు చూడగా ఓ కార్పొరేటర్ సిఫారసుతో ఉన్నతాధికారులు విచారణ తొక్కిపెట్టారు. ఆర్పీ అక్రమాలతో సంఘ సభ్యులు జీవితకాలం దివాలాదారులుగా ముద్రపడ్డారు. నగరంలో గడచిన ఐదేళ్లలో రూ.15 కోట్ల వరకు వివిధ రూపాల్లో మోసాలు జరిగినట్లు ఆరోపణలున్నాయి.

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: పొదుపు ఉద్యమ స్ఫూర్తి గాడితప్పింది. అవి చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా అన్న సామెత మెప్మా సిబ్బందికి అతికినట్లు సరిపోతుంది. గత వైకాపా 'సేవలో' తరించి ఎన్నికల రోజు వరకు ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపు కోసం పరితపించిపోయిన వారు కీలక స్థానాల్లో తిష్ట వేసి అందినంత దండుకుంటున్నారు. ప్రస్తుత బదిలీల్లోనూ అధికశాతం ఉద్యోగులు ఇక్కడే పాతుకుపోవడం, వారికి కొందరు కూటమి నేతలు వంత పాడటంపై విమర్శలున్నాయి. ఉన్నతాధికారి నుంచి సీఎంఎంలు, ఆర్పీలు, సీవోల అక్రమాలు పొదుపు ఉద్యమ స్ఫూర్తిని దెబ్బతీస్తున్నాయి.

జగనన్న మార్ట్‌లో తేలని లెక్కలు

తిరుపతిలో జగనన్న మహిళా మార్టును రాష్ట్రంలో అధిక ఆదాయం పొందుతున్న మార్ట్‌గా తీర్చిదిద్దేందుకు నగరంలోని 50 వేల మంది మహిళల్ని మెప్మా అధికారులు వేధించారు. ప్రతి మహిళా ప్రతినెలా రూ.వెయ్యి విలువైన వస్తువుల్ని కొనాల్సిందేనన్న షరతు విధించారు. మూడేళ్లపాటు పూర్తిస్థాయి ఆడిటింగ్ ఊసేలేదు. ప్రభుత్వం మారగానే 15 రోజులపాటు సీసీ కెమెరాలు నిలిపేసి లెక్కల్ని సరిచేసినట్లు ఆరోపణలున్నాయి.

రుణ మంజూరులో చేతివాటం

నగరపాలక సంస్థ పరిధిలో 5,158 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. అందులో 52,792 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. తిరుపతిలోని నాలుగు పట్టణ సమాఖ్యల పర్యవేక్షణలో 151 మంది ఆర్పీలు నేరుగా మెప్మా కార్యకలాపాలు నిర్వహిస్తుంటారు. బ్యాంకు లింకేజీ రుణాలు ఒక్కో సంఘానికి రూ.20 లక్షల వరకు రుణం తీస్తారు. అందులో రూ.20 వేల వరకు మామూళ్లు ఇస్తేగాని రుణమందే పరిస్థితి లేదు. ఇలా ఒక్కో ఆర్పీ కనిష్ఠంగా నెలకు ఐదారు సంఘాలకు రుణం మంజూరు చేయిస్తూ రూ.లక్ష వరకు వెనకేసుకుంటున్నారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికలు వాయిదా!

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: తిరునగరిలో స్థానిక రాజకీయం వేడెక్కింది. నగరపాలక స్టాండింగ్ కమిటీ ఎన్నికలపై సర్వత్రా ఉత్కంఠ కనిపిస్తోంది. వైకాపా కార్పొరేటర్లు అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి వాయిదా వేశారని ఆరోపిస్తూ.. ఎన్నికల కోసం పట్టుబడుతూ బుధవారం ఆందోళనకు దిగారు. కమిషనర్ నుంచి సానుకూల సమాధానం లేదని ఆరోపిస్తూ ఖాళీ కుర్చీకి వినతిపత్రం అందజేశారు. తిరుపతి నగరపాలకసంస్థలో స్టాండింగ్ కమిటీది కీలకపాత్ర. అత్యవసరమైన, సాధారణంగా రూ.10 లక్షల లోపు పనులను ఆమోదించే అధికారం దీనికి ఉంటుంది. అప్పట్లో నగర మేయర్ అధ్యక్షతన ఉప మేయర్ అభినయ్‌రెడ్డి, నాటి ఎమ్మెల్యే కరుణాకర్‌రెడ్డి కుటుంబానికి అత్యంత సన్నిహితులైన వేంకటేశ్వర్లు, ఉమ, ఎస్.కె.బాబు సభ్యులుగా కమిటీ ఏర్పాటైంది. ఏటా ఎన్నికలు జరగాల్సి ఉండగా.. నాలుగేళ్లుగా వాటి ఊసే లేదు. వైకాపా హయాంలో కమిటీ ఆమోదించిన రూ.కోట్ల విలువైన పనుల్లో అవినీతి చోటుచేసుకుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిబంధనల ప్రకారం స్టాండింగ్ కమిటీ ఎన్నికలు నిర్వహించాలని కమిషనర్ ఎన్.మౌర్య ఈ నెల 19న ప్రకటన విడుదల చేశారు. నామినేషన్ల దాఖలు గడువు గురువారంతో ముగియనుండగా బుధవారం వైకాపా కార్పొరేటర్లు నగరపాలక సంస్థ కార్యాలయానికి తరలివచ్చారు. వైకాపా తరఫున నామినేషన్లు దాఖలు చేయడానికి యత్నించారు. అయితే పాలనాపరమైన సమస్యల దృష్ట్యా ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారి జారీచేసిన నోటీసును నగరపాలక కార్యదర్శి రాధికారెడ్డి మేయర్‌కు అందజేశారు. ఈ నెల 24న నగరపాలిక కార్పొరేటర్లు 16 మంది నగరపాలిక కమిషనర్‌ను కలిసి శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో వాయిదా వేయాలని వినతిపత్రం ఇచ్చినట్లు అధికారులు, పలువురు కార్పొరేటర్లు పేర్కొన్నారు.

పట్టించుకోకనే ఈ పరిస్థితి

నగరపాలక సంస్థ కౌన్సిల్‌లో ప్రస్తుతం 47 మంది కార్పొరేటర్లు ఉన్నారు. వారిలో కూటమికి 16 మంది మద్దతు ఉంది. ఎమ్మెల్సీ, ఎంపీ, ఎమ్మెల్యేలకు స్టాండింగ్ కమిటీలో ఓటు హక్కు ఉంటుంది. రెండు నెలలుగా కూటమివైపు ఆసక్తి కనబరిచిన కార్పొరేటర్లను కూడా ఆ పార్టీల నేతలు పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి.

టాస్క్‌ఫోర్స్‌కు.. బదిలీల బలహీనతలు



◗ ఎస్పీకి స్థానచలనం కలిగినా కొనసాగింపు ◗ డీఎస్పీల నియామకంలోనూ ఎదురుచూపులు

జీవకోన (తిరుపతి), న్యూస్‌టుడే: శేషాచలం కొండల్లోని ఎర్రచందనం సంరక్షణకు ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్‌లో జరుగుతున్న బదిలీల వెనుక మతలబేమిటో ఎవరికీ అంతుపట్టడం లేదు. అధికారులను బదిలీ చేస్తున్నట్లు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తున్నా వారు కొనసాగుతుండటం గమనార్హం. కొందరు బదిలీపై వెళ్లినా వారి స్థానాల్లో కొత్తవారు రావడం లేదు.

వైకాపా ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలు, నాయకులతో అంటకాగిన అధికారులను బదిలీచేసి ఆయా శాఖలను ప్రక్షాళన చేయాలని కూటమి ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలోనే ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ డీఎస్పీని ఆగస్టు మొదటి వారంలో బదిలీ చేసింది. ఆ స్థానంలో ఎవరినీ నియమించలేదు. టాస్క్‌ఫోర్స్‌లో మూడు డీఎస్పీ పోస్టులుండగా వైకాపా ప్రభుత్వం ఇద్దరినే ఐదేళ్లు కొనసాగించింది. కూటమి ప్రభుత్వం రాగానే మురళీధర్‌ను ప్రొద్దుటూరుకు, చెంచుబాబును నాయుడుపేట డీఎస్పీగా బదిలీ చేయడంతో రెండు పోస్టులూ ఖాళీ అయ్యాయి. ఈ నెల 18న ప్రొద్దుటూరుకు వెళ్లిన మురళీధర్‌నే మళ్లీ టాస్క్‌ఫోర్స్ డీఎస్పీగా నియమించడం గమనార్హం. టాస్క్‌ఫోర్స్ ఎస్పీగా పనిచేస్తున్న శ్రీనివాస్‌ను గతనెలలో అనంతపురం పోలీసు శిక్షణ కేంద్రం (అప్పా)కు బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. అప్పటి నుంచి ఎవరినీ ఇక్కడ నియమించకపోవడంతో ఆయనే ఎస్పీగా కొనసాగుతున్నారు. వైకాపా నేతలతో అంటకాగారన్న ఆరోపణలతోనే రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్‌రెడ్డిని ప్రభుత్వం ఇటీవలే వీఆర్‌కు పంపింది. ఈ స్థానంలోనూ ఎవరినీ నియమించలేదు. టాస్క్‌ఫోర్స్ పోలీస్ స్టేషన్‌లో సీఐ స్థానంలో మరొకరిని కేటాయించ లేదు. ఇలా బదిలీల్లో చోటుచేసుకుంటున్న గందరగోళ పరిస్థితులతో టాస్క్‌ఫోర్స్ పనితీరుపై తీవ్ర ప్రభావం పడుతోంది.

నవోదయ ప్రవేశాలకు గడువు పొడిగింపు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశాల (2025-26)కు సంబంధించిన పరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవడానికి అక్టోబరు ఏడో తేదీ వరకు గడువు పొడిగించారు. ఎన్‌వీఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించాలని, తప్పిదాల సవరణకు 8, 9 తేదీల్లో అవకాశం ఉంటుందని ప్రిన్సిపల్ గోవిందరావు తెలిపారు.

ప్రయాణమే అసలు పరీక్ష

◗ టెట్ కేంద్రాలు వందల కి.మీ దూరం

◗ ఆందోళనలో అభ్యర్థులు

గూడూరు, కోట, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) రాసే అభ్యర్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. వారు ఎంపిక చేసుకున్న ఆప్షన్లకు కాకుండా ఇతర ప్రాంతాల్లో పరీక్ష కేంద్రాలు కేటాయించడంతో ప్రయాణం పెద్ద సమస్యగా మారుతోంది. టెట్ పాసైన వారు మాత్రమే డీఎస్సీ పరీక్ష రాయడానికి అర్హులు. కాగా కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు 16 వేల పోస్టుల భర్తీకి ప్రకటన చేసింది. ఈ పరీక్షలు రాసేందుకు వచ్చే నెల 3 నుంచి 21 వరకు టెట్ నిర్వహణ ఏర్పాట్లు పాఠశాల విద్యాశాఖ చేపట్టింది.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,478 ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నట్లు గుర్తించారు. వీటిని జిల్లా సెలక్షన్ కమిటీ(డీఎస్సీ) ద్వారా భర్తీ చేయనున్నారు. ఇందుకు అవసరమైన అర్హత పరీక్ష టెట్ నిర్వహణ చేపడుతోంది. పెద్దసంఖ్యలో అభ్యర్థులు పరీక్షలు రాయడానికి సిద్ధమవుతున్నారు. పరీక్షల కేంద్రాలు పట్టణాలకు దూరంగా ఉండటం.. అభ్యర్థులకు కొన్నిచోట్ల పరీక్షల కేంద్రాలు 100-150 కి.మీ పైగా ఉండటంతో అవస్థలు తప్పవని వాపోతున్నారు.

మూడు ఆప్షన్ల ఆందోళన

టెట్ రాసే విద్యార్థులు మూడు జిల్లాలకు ఆప్షన్లు ఇచ్చారు. ఇలా కొందరు రెండు పరీక్షలు రాయాల్సి ఉంది. ఉదయం, మధ్యాహ్నం సమయంలో వేర్వేరు చోట్ల పరీక్షలు రాయాల్సి. ఇలాంటి వారు వెళ్లి రావడం చాలాకష్టం. పట్టణ శివార్లలో ఉండే కాలేజీల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. వెతుక్కొంటూ వెళ్లడానికి తప్పవని ఆవేదన చెందుతున్నారు.

- టెట్ నోటిఫికేషన్ : జులై 2
- పరీక్షల షెడ్యూల్: అక్టోబర్ 3-21
- ఉదయం : 9.30-12.00
- మధ్యాహ్నం : 2.30-5.00
- ఫలితాలు : నవంబర్ 2

నెల్లూరు జిల్లా వాసికి చిత్తూరులో పరీక్ష

టెట్ కోసం నెల్లూరు జిల్లాకు చెందిన ఓ మహిళ చిత్తూరు జిల్లాలో పరీక్ష రాయాల్సి ఉంది. ఆమె రెండు జిల్లాలు దాటి మూడో జిల్లాలో 200 కి.మీ వెళ్లి పరీక్షలు రాయాల్సి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం : శేఖర్, డీఈవో, తిరుపతి

అభ్యర్థుల నుంచి ఫిర్యాదులొస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

140 కి.మీ ప్రయాణం చేయాలి



మాది నాయుడుపేట మండలం మేనకూరు.. కాగా ఇక్కడి నుంచి 140 కి.మీ ప్రయాణం చేయాలి. నాయుడుపేట నుంచి నెల్లూరు అక్కడి నుంచి కావలి విట్స్‌లో పరీక్షలకు హాజరు కావాలి. ఉదయం వెళ్లడానికి వీలు లేదు. ఒక్క రోజు ముందే హాజరు కావాలంటే ఖర్చుల భారం తడిసి మోపెడవుతుంది.

- గురుప్రసూన, ఎజ్జీటీ, నాయుడుపేట

మూడు బస్సులు మారాలి



మాది తాళ్వాయపాడు. ఇక్కడి నుంచి ఆటో నాయుడుపేటకు.. అక్కడి నుంచి బస్సులో నెల్లూరు వరకు.. అక్కడి నుంచి కావలి వెళ్లాలి. ఇలా మూడు బస్సులు మారి పరీక్షకు రాయాలి. పరీక్షకు ముందు రోజే చేరుకోవాల్సి ఉంది. భర్తతో పాటు వెళ్లి రావడానికి రూ.2 వేలు వరకు ఖర్చవుతోంది.

- ఒబ్బు లావణ్య, తాళ్వాయపాడు, పెళ్లకూరు మండలం

పారిశ్రామికవేత్తల చూపు.. జిల్లా వైపు



మేనకూరు పారిశ్రామికవాడలో నిర్మాణంలో త్రీఎక్స్ పరిశ్రమ

☛ మేనకూరు సెజ్, క్రిస్ సిటీ, శ్రీసిటీల్లో పరిశ్రమల ఏర్పాటు

☛ రూ.72 వేల కోట్ల పెట్టుబడులకు అవకాశం

నాయుడుపేట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం వచ్చాక పారిశ్రామికవేత్తల చూపు మళ్లీ రాష్ట్రంపై పడింది. దీంతో మేనకూరు సెజ్, క్రిస్ సిటీ, శ్రీసిటీ పారిశ్రామిక వాడల్లో రూ.72 వేల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశముంది. ఇప్పటికే కొన్ని పరిశ్రమలకు భూములు కేటాయించడంతో కార్యకలాపాలు జరుగుతున్నాయి. పరిశ్రమల ఏర్పాటుకు జిల్లా అనుకూలమైనా వైకాపా హయాంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, పారిశ్రామికవాడల్లో వసతులు కల్పించకపోవడంతో పారిశ్రామికవేత్తలు వెనుకంజ వేశారు. కూటమి ప్రభుత్వం సింగిల్ విండో విధానంలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు ఇవ్వడం.. మౌలిక వసతుల కల్పనలో పరిశ్రమల ఏర్పాటుకు ఒప్పందాలు జరిగాయి.

4 లక్షల మందికి ఉపాధి..

కోట, చిల్లకూరు మండలాల్లోని తీర ప్రాంతంలో క్రిస్ సిటీ నిర్మాణానికి 2016లో తెదేపా, ఎన్డీయే ప్రభుత్వాలు 2500.49 ఎకరాల్లో భూసేకరణ చేపట్టాయి. వైకాపా ప్రభుత్వం భూసేకరణ, నిర్వాసితులకు పరిహారం చెల్లింపులో జాప్యం చేసింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో భూసేకరణ పనులు కొలిక్కి వచ్చాయి. ఇక్కడ 7 పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు రూ.37,500 కోట్ల పెట్టుబడులతో 4 లక్షల మందికి ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం ప్రణాళిక చేసింది. ఈ పారిశ్రామికవాడలకు జాతీయ రహదారులు, రైల్వే లైన్లు అనుసంధానం చేయనున్నారు. త్వరలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ద్వారా క్రిస్ సిటీ పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

రూ.1,800 కోట్లతో కార్బన్ పరిశ్రమ..


మేనకూరు పారిశ్రామిక వాడలో రూ.1,800 కోట్లతో బిర్లా కార్బన్ పరిశ్రమ ఏర్పాటుకు ఇటీవల ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. ఈ పరిశ్రమ ద్వారా 500 మందికి ఉపాధి కలిగే అవకాశం ఉంది. కార్బన్ ఉత్పత్తులతో పాటు అదనంగా పవర్ జనరేషన్ ప్లాంటు ఏర్పాటు చేసి విద్యుత్తు ఉత్పత్తి చేయనున్నారు. ఇదే పారిశ్రామిక వాడలో గ్రీన్‌టెక్ పరిశ్రమ రూ.250 కోట్ల పెట్టుబడులతో అదనపు ప్లాంట్ ఏర్పాటుకు అనుమతులు తీసుకుంది.

రూ.40 కోట్లతో అత్తివరం వద్ద..

పరిశ్రమలకు ఉక్కు నిర్మాణాలను అందించే ఇంటరార్క్ సంస్థ అత్తివరం వద్ద రూ.40కోట్ల పెట్టుబడులతో ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ఇందుకు 10 ఎకరాల భూమి కేటాయించనున్నారు. మొదటి దశలో నాలుగు ఎకరాల్లో ప్లాంటు ఏర్పాటు చేయనున్నారు. ఇది పూర్తయితే రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలన్నింటికీ ఉక్కు నిర్మాణ పరికరాలు అందించే అవకాశముంది.

పేదలందరికీ సంక్షేమ పథకాలు

ఏర్పేడు, న్యూస్‌టుడే: పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కలెక్టర్ డా.వెంకటేశ్వర్ తెలిపారు. శ్రీకాళహస్తి మండలం మేలచ్చూరులో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ ప్రజల సమస్యలు తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో మరిన్ని పరిశ్రమలు రానున్నాయని వివరించారు. ఉమ్మడి జిల్లాలో తిరుమల, శ్రీకాళహస్తి, కాణిపాకం, గుడిమల్లం వంటి పుణ్యక్షేత్రాలు కొలువుదీరి ఉండటంతో పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేయడంతో ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని వివరించారు. అపాచీ పరిశ్రమకు భూములు ఇచ్చిన రైతులకు పరిహారం అందించడమే కాకుండా నియోజకవర్గంలో భూ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, జేడీఏ ప్రసాద్‌రావు, సీడీపీవో శాంతిదుర్గ, ఎంపీడీవో పఠాన్‌రఫీఖాన్, తహసీల్దార్ లక్ష్మీనరసింహ పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

● మన్నవరం సమీపంలోని ఎన్టీపీసీ, భెల్ పవర్ ప్రాజెక్టును కలెక్టర్ డా.వెంకటేశ్వర్, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పరిశీలించారు. పరిశ్రమ ప్రతినిధులతో సమావేశమై 2008లో 750 ఎకరాలను కేటాయించగా ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న స్థలం గురించి ఆరా తీశారు.

మట్టి ట్రాక్టర్లు పట్టుకున్నారు.. వదిలేశారు

పెళ్లకూరు, న్యూస్‌టుడే: పెళ్లకూరు మండలం చెంబడిపాళెంలో స్థానికుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు సుమారుగా 20 మట్టి ట్రాక్టర్లు బుధవారం పట్టుకున్నారు. వీటిని రాజకీయ పైరవీలతో వదిలి పెట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చెంబడిపాళెం నుంచి ఇటుక బట్టీలకు మట్టి తరలిస్తుండగా వాటిని స్వాధీనం చేసుకుని వదిలి పెట్టేయడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇటు మైనింగ్ శాఖకు గాని అటు పోలీసులకు గాని అప్పగించకపోవడం గమనార్హం.



చెంబడిపాళెంలో మట్టి ట్రాక్టర్లను అడ్డుకున్న స్థానికులు

ఎక్సైజ్ అధికారుల బదిలీ



విజయశేఖర్

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ)ను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో విలీనం చేసిన తర్వాత ఉన్నతాధికారుల బదిలీలు. నియామకాలు చేపట్టారు. ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేష్ కుమార్ మీనా ఉత్తర్వులు విడుదల చేశారు. అనంతపురంలో డీసీగా పనిచేస్తున్న టి.విజయశేఖర్‌ను ఉమ్మడి చిత్తూరు జిల్లా డీసీగా నియమించారు. తిరుపతి ఏపీఎస్‌బీసీఎల్ డిపో మేనేజరు, జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారిగా పనిచేస్తున్న కె.జానకిరామ్‌ను ఏపీఎస్‌బీసీఎల్ కమిషనరేట్‌లో డీఎంగా రిపోర్టు చేశారు. నెల్లూరు డీపీఈవోగా పనిచేస్తున్న కె.నాగ మల్లీశ్వరరెడ్డిని తిరుపతి జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారిగా నియమించారు. తిరుపతి ఏపీఎస్‌బీసీఎల్ డీఎం పోస్టు భర్తీ చేయాల్సి ఉంది. తిరుపతి డిస్టిలరీస్ డీసీగా పనిచేస్తున్న కె.శ్రీనివాసాచారిని ఉమ్మడి చిత్తూరు జిల్లా డీసీగా నియమించారు. అనంతపురం విజిలెన్స్ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎన్.బాలకృష్ణను తిరుపతి డిస్టిలరీస్‌కు బదిలీ చేశారు.

ఎస్పీడీసీఎల్‌లో..



తిరుమల డీఈఈ (ఆపరేషన్)గా బదిలీ అయిన వి.సతీష్‌ను అభినందిస్తున్న సిబ్బంది

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: ఎస్పీడీసీఎల్, తిరుపతి పరిధిలో భారీగా బదిలీలు జరిగాయి. బుధవారం సీఎండీ కె.సంతోష్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. ఉమ్మడి కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప, నెల్లూరు జిల్లాల్లో పరిధిలోని ఈఈలు 31 మంది, డీఈఈలు 64 మందికి స్థానచలనం కలిగింది. ఏఈలు 28, జేఈఈలు 2, ఏవోలు, ఏసీసీలు 2, ఏఏవోలు, ఏసీసీలు 19, జూనియర్ సహాయకులు 2, ఎస్‌వోఎస్ 1, జేఎల్ఎంలు 2, పీవో 1 మొత్తం 152 మందిని బదిలీ చేశారు.

పలువురు సీఐలు..

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: జిల్లాలో పలువురు సీఐల బదిలీ చేపట్టారు. తిరుపతి తూర్పు పీఎస్ సీఐగా పనిచేస్తున్న మహేశ్వరరెడ్డిని వీఆర్‌కు బదిలీ చేశారు. ట్రాఫిక్ పీఎస్‌లో పనిచేస్తున్న సీఐ శ్రీనివాసులును తిరుపతి తూర్పు సీఐగా నియమించారు. చిత్తూరు వీఆర్‌లో ఉన్న డి.మునిస్వామిని పుత్తూరు రూరల్‌కు, అక్కడ పనిచేస్తున్న భాస్కర్ నాయక్‌ను తిరుపతి వీఆర్‌కు బదిలీ చేశారు. తిరుపతి వీఆర్‌లో ఉన్న వి.చిన్న పెద్దయ్యను శ్రీసిటీకి, శ్రీరాములును డీటీఆర్‌బీకి నియమించారు. తిరుపతి డీటీసీగా పనిచేస్తున్న ఎ.శ్రీరాముడుని తిరుమల-2కు, అక్కడ పనిచేస్తున్న ఎ.సత్యనారాయణను వీఆర్‌కు బదిలీ చేశారు.

ఐదులో హేమంత్.. రెండులో కృత్తిక

ఆ బడుల్లో ఇద్దరేసి విద్యార్థులు ♦ ఏక సంఖ్యతో వ్యయం తడిసి మోపెడు

వెంకటగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: ఇద్దరు విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు, మరో ఆయా.. మధ్యాహ్న భోజన ఏజెన్సీ. ఈ లెక్కన ఆ ఇద్దరి చదువుకు నెలకు ప్రభుత్వ ఖర్చు తడిసి మోపెడవుతోంది. బాలాయపల్లి మండలం సిద్ధగుంట ప్రాథమిక పాఠశాల ఇద్దరు విద్యార్థులతో నడుస్తోంది. ఇటీవల పరిశీలించగా ఇద్దరు విద్యార్థులు ఓ మాస్టారు అందుబాటులో ఉన్నారు. ఉపాధ్యాయుడిని వివరాలు అడిగితే ఐదో తరగతికి హేమంత్, రెండో తరగతిలో కృత్తిక ఉన్నట్లు తెలిపారు. గత నెల 27న మేలచ్చూరు నుంచి కాలనీకి ఓ కుటుంబం చేరిందని ఆ ఇంటి నుంచి ఇద్దరు చిన్నారులు బడిలో చేరినట్లు పేర్కొన్నారు. ఆ ఇద్దరిని వారింటిలో వదిలిపెట్టడానికి ఆయా తీసుకెళ్లన్నారు. గతేడాది సంఖ్య నాలుగు అయితే ఇద్దరు ఆరో తరగతి పదోన్నతితో ఉన్నత పాఠశాలకు వెళ్లినట్లు చెప్పారు.



సిద్ధగుంట బడిలో ఇద్దరు విద్యార్థులతో ఉపాధ్యాయులు

స్థూలంగా పరిశీలిస్తే..

తక్కువ మంది విద్యార్థులు కనుక కాస్తంత శ్రద్ధగా చెబితే ఆ వచ్చే వారు ఎగ్గొడతారనే భావన వినిపిస్తోంది. సిద్ధగుంట విద్యార్థుల సామర్థ్యాన్ని ప్రస్తావిస్తే.. ఐదో తరగతి విద్యార్థికి కనీస సామర్థ్యం లేదనేది గ్రామస్థుల మాట. గ్రామంలో 20 మంది వరకు ప్రైవేటు పాఠశాలలకు వెళ్లి చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలో సదుపాయాలు ఉండీ వెలవెలబోవడానికి కారణాలను గుర్తించి చక్కబెట్టాల్సి ఉంది. సమీపంలోని ఉన్నత పాఠశాలల్లో మూడు నుంచి ఐదో తరగతి వరకు విలీనం చేయడంతో మిగతా కొన్ని చోట్ల విద్యార్థుల సంఖ్య పడిపోయింది.

◆ ఎంఈవో కిల్లా వెంకటేశ్వర్లును వివరణ కోరగా గొల్లగుంట పాఠశాలలో ఇద్దరికి ఒక విద్యార్థే హాజరైనట్లు ఇటీవల తన పరిశీలనలో గుర్తించినట్లు తెలిపారు. ఉపాధ్యాయుడికి తాజాగా మెమో ఇచ్చామన్నారు.



సిద్ధగుంట పాఠశాలలో వృథాగా గతంలో నిర్మించిన నాలుగు మరుగుదొడ్లు

పలుచోట్ల ఇలాగే..

చిలమనూరు పంచాయతీ గొల్లగుంట లోనూ ఇద్దరు విద్యార్థులే. వెంకటగిరి మండలం వర్ధనపల్లిలోనూ ముగ్గురితో పాఠశాల సాగుతోంది. బాలాయపల్లి మండలం మన్నూరు మెయిన్, పిగిలాంలో నలుగురేసి పరిమితమయ్యారు. అరిగేపల్లి, కోనంగుంట డక్కిలి మెయిన్, తీర్థంపాడు, వెంకటగిరి మండలం కలపాడు, గొట్లగుంట పాఠశాలల్లో ఆరుగురు చొప్పున ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇలా ఏక సంఖ్యతో వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో 39 బడులున్నాయి. తక్కువ మంది ఉన్న చోట మధ్యాహ్న భోజన ఏజెన్సీలకూ గిట్టుబాటు కాదని స్పష్టమవుతున్నా సేవాభావంతో నెట్టుకొస్తున్నారు. మరో వైపు ఇద్దరు, ముగ్గురికి ఓ మాస్టారు, ఆయా వేతనాలు లెక్కిస్తే ఒక్కొక్కరికి నెలకు భారీగానే ప్రభుత్వానికి వ్యయమవుతోంది.

పొరుగు సేవకుడి చేతివాటం

డిగ్రీ విద్యార్థినులకు శాపం

శ్రీకాళహస్తి, తొట్టంబేడు, న్యూస్‌టుడే: ప్రభుత్వ కళాశాలల్లో చదివే పేద విద్యార్థినులు చెల్లించిన సొమ్మును ఆరగించేశాడు. నెల క్రితం అక్రమం వెలుగుచూసినా చర్యలు లేకపోవడం గమనార్హం. స్థానిక శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పొరుగు సేవల పద్ధతిలో కుమార్ క్లర్క్‌గా పనిచేస్తున్నాడు. విద్యార్థినులు కళాశాలకు చెల్లించాల్సిన ఫీజులను ఇతనే వసూలు చేస్తుంటాడు. కరోనా ముందు వరకు నేరుగా చెల్లిస్తే బిల్లులు ఇచ్చేవారు. 2020 నుంచి ఆన్‌లైన్ చెల్లింపులకు వీలు కల్పించారు. విద్యార్థినులు నగదు రూపేణా చెల్లించినా, యూపీఐల ద్వారా చెల్లించినా కుమార్ కళాశాలకు జమ చేయకుండా సొంత అవసరాలకు వాడుకున్నాడు. ఇలా ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థినుల డబ్బులు నొక్కేశాడు. విద్యార్థులు చదువు పూర్తయ్యాక ధ్రువపత్రాలు పొందే సమయంలో ఫీజు బకాయిలు ఉన్నాయనడం, తాము చెల్లించామంటూ విద్యార్థినులు చెప్పడంతో కళాశాల ప్రిన్సిపల్‌తోపాటు అధ్యాపకులకు అనుమానం వచ్చింది. ఇదే విషయమై గత నెలలో కొందరు తల్లిదండ్రులు గట్టిగా అడగడంతో కుమార్ నిర్వాకం బయటపడింది. రూ.3 లక్షలకు పైగా నగదు సొంతానికి వాడుకున్నట్లు తేలింది. ఈ క్రమంలో కుమార్ విధులకు రావడం మానేశాడు. కళాశాల నుంచి విద్యార్థినులకు ఒత్తిళ్లు పెరగడంతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.

గడువులోగా చెల్లించకుంటే చర్యలు

పొరుగు సేవకుడు కుమార్ సొంతానికి వాడుకున్న సొమ్మును కళాశాలకు తిరిగి చెల్లించాలని సూచించాం. అందుకు అతను గడువు కోరాడు. అప్పటిలోగా చెల్లించకుంటే తదుపరి చర్యలు తీసుకుంటాం.

- రాజశేఖర్, ప్రిన్సిపల్, మహిళా డిగ్రీ కళాశాల

భక్తిశ్రద్ధలతో సేవలందించండి



మాట్లాడుతున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సేవకులు అత్యంత క్రమశిక్షణ, అంకితభావం, భక్తిశ్రద్ధలతో శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు సేవలు అందించడమే కాకుండా యాత్రికులకు అందుతున్న వివిధ సేవలపై అభిప్రాయ సేకరణ చేయాలని తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి పిలుపునిచ్చారు. స్థానిక సేవాసదన్-2లో బుధవారం సాయంత్రం జరిగిన సత్సంగ కార్యక్రమంలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన శ్రీవారి సేవకులతో సమావేశమయ్యారు. అనంతరం శ్రీవారి సేవకులకు ఆయనే స్వయంగా ఈ-డిప్ విధానంలో ఆలయ డ్యూటీని విడుదల చేశారు. చీఫ్ పీఆర్వో టి.రవి, పీఆర్వో పి.నీలిమ పాల్గొన్నారు.

నటుడు మోహన్‌బాబు ఇంట్లో రూ.10 లక్షల చోరీ

◆ దొంగతనం చేసింది పని మనిషే..
◆ అదుపులోకి తీసుకున్న పోలీసులు

పహాడీషరీఫ్, న్యూస్‌టుడే: సినీ నటుడు మోహన్‌బాబు ఇంట్లో రూ.10 లక్షలు చోరీ అయిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ శివారు జల్‌పల్లిలోని మంచు టౌన్‌షిప్‌లో నివాసముంటున్న మోహన్‌బాబు ఇంట్లో శ్రీసత్యసాయి జిల్లా కదిరికి చెందిన గణేశ్‌నాయక్(24) అనే యువకుడు 8 నెలల క్రితం పనికి కుదిరాడు. మూడు రోజుల క్రితం మోహన్‌బాబు ఇంట్లో ఉన్న రూ.10 లక్షల నగదును గణేశ్‌నాయక్ దొంగతనం చేసి పరారయ్యాడు. విషయాన్ని గుర్తించిన మోహన్‌బాబు సహాయకుడు కిరణ్ తేజ రెండు రోజుల క్రితం పహాడీషరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు బుధవారం నిందితుడిని తిరుపతిలోని ఓ లాడ్జిలో అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఆయన నుంచి రూ.7.50 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయాలు.. వసూళ్ల నిలయాలు

◆ దస్తావేజు లేఖర్ల కనుసన్నల్లోనే వ్యవహారం ◆ పట్టించుకోని ఉన్నతాధికారులు



గూడూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

గూడూరు, న్యూస్‌టుడే: సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు వసూళ్లకు నిలయాలుగా మారాయి. పత్రాలు సక్రమంగా ఉన్నా చేయి తడిపితే కానీ పని కావడం లేదు. కొందరు డాక్యుమెంట్ రైటర్లే వసూళ్ల రాయుళ్లుగా చలామణి అవుతున్నారు. ఫిర్యాదులు వస్తున్నా పట్టించుకునే పరిస్థితి కరవైంది. అధికారుల వాటాతో పాటు దస్తావేజు తయారీ ఖర్చుల కింద పెద్ద ఎత్తున వసూలు చేస్తున్నారు.

జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.782.68 కోట్ల లక్ష్యంగా ఉంది. 16 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా.. తిరుపతి రూ.172.77 కోట్లు, గ్రామీణం రూ.97.41 కోట్లు, గూడూరు రూ.52.91 కోట్లు, చంద్రగిరి రూ.46.03 కోట్లు, సూళ్లూరుపేట రూ.31.92 కోట్ల మేర ఏటా లక్ష్యంగా ఉంది. ఇందులో 3-5 శాతం మేర వసూలు చేస్తున్నారు. అధికారుల వాటాగా ఫీజుటు ఫీజు వసతుల పేరిట మరికొంత, కార్యాలయ ఖర్చుల పేరిట లెక్కలేస్తున్నారు.

భయపెట్టి మరీ..

జిల్లాలోని కార్యాలయాల్లో ఏటా రూ.50 కోట్ల మేర వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఫీజుతో పాటు పత్రాలు సరిగా లేవని భయపెట్టి నాలుగైదు రెట్లు అధికంగా వసూలు చేస్తున్నారు. గూడూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఎదుట డాక్యుమెంట్ రైటర్లపై 2019లో అనిశా దాడులు చేసింది. ఆ సమయంలో రూ.లక్షల్లో నగదు బయట పడింది. రైటర్ల వద్ద నగదు పట్టుబడగా వారిపై కేసులు నమోదు చేశారు. అయినా పరిస్థితులు మాత్రం మారలేదు.

◆ సూళ్లూరుపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఓ డాక్యుమెంట్ రైటరే అంతా తానై వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. తడ, దొరవారిసత్రం మండలాల నుంచి ప్రజలు, ఉద్యోగులను తన గుప్పెట్లో పెట్టుకుని చక్కబెట్టేయడం గమనార్హం. ఏకంగా రూ.50 కోట్ల మేర తన పాతికేళ్లలో కూడబెట్టినట్లు స్థానికుల ఆరోపణ.

లొసుగులు సృష్టిస్తూ..

స్థిరాస్తి కార్యకలాపాల్లో అమ్మకాలు, కొనుగోళ్లలో ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి కావడంతో వీరి నుంచి పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నారు. పత్రాలు సక్రమంగా ఉన్నా. కొర్రీలు పెట్టి మరీ వసూలు చేస్తున్నారు. ఈ తతంగం అంతా దస్తావేజు లేఖర్ల కనుసన్నల్లోనే జరగడం గమనార్హం. పట్టణాల్లో మిగులు భూముల క్రయవిక్రయాల్లో దస్త్రాల తయారీలో లొసుగులు సృష్టిస్తున్నారు.

◆ ఉదాహరణకు నాయుడుపేటలో నాలుగేళ్ల కిందట ఓ వ్యక్తి జీపీఏ ద్వారా భూమి కొంటే దానికి తమ బంధువుల సంతకాలు లేవని స్వాధీనం చేసుకోగా.. కొనుగోలుదారు రూ.50 లక్షలు చెల్లించి తిరిగి రిజిస్టర్ చేసుకున్నారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.45 కోట్లు




హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ ఇన్‌ఛార్జి ఈవో చంద్రశేఖర్ ఆజాద్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామి, అమ్మవార్లతో పాటు పరివార దేవతామూర్తుల హుండీల ద్వారా రూ.1,45,87,352 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇన్‌ఛార్జి ఈవో చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. ఆలయంలోని శ్రీ మేధా దక్షిణామూర్తి సన్నిధి వద్ద బుధవారం హుండీల లెక్కింపు చేపట్టినట్లు వివరించారు. 28 గ్రాముల బంగారం ఈ ఆదాయం సమకూరిందని, దీంతో పాటు స్వల్పంగా బంగారం, 421 కిలోల వెండి, 3,452 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చినట్లు వెల్లడించారు. సగటున రోజుకు హుండీల ద్వారా రూ.5.60 లక్షలు సమకూరుతోందని ఈవో తెలిపారు.

దస్త్రం కోసం వెతుకులాట

సూళ్లూరుపేట: బాణసంచా విక్రయ కేంద్రంలో జరిగిన ప్రమాదానికి సంబంధించిన గల్లంతైన కీలక ఫైలు కోసం సూళ్లూరుపేట తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులు వెతుకులాట ప్రారంభించారు. దీనిపై 'ఈనాడు'లో కథనం రావడంతో ఉన్నతాధికారులు ఆరా తీశారు. దాంతో కార్యాలయంలో గాలించినా ఫలితం లేదు. మరోవైపు కొందరు ఉద్యోగులు సాధారణ బదిలీల్లో భాగంగా ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. వారు గల్లంతైన ఫైలు సంగతి నుంచి తప్పించుకునేందుకు వీలుగా రిలీవ్ అయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వారు వెళ్తే గల్లంతైన ఫైలు విషయం కొలిక్కి వచ్చే అవకాశం లేదు.

ముఖ్యమంత్రిని కలిసిన శాప్ ఛైర్మన్ రవినాయుడు



తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన అనిమిని రవినాయుడు బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. తనపై నమ్మకంతో కీలకమైన శాప్ ఛైర్మన్‌గా అవకాశం కల్పించడంపై ఆయన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో క్రీడారంగం పూర్తిగా పడకేసిందని, విద్యార్థులు, యువత క్రీడలకు దూరం అయ్యారని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు రవినాయుడు వివరించారు. రాష్ట్రంలో నిద్రావస్థలో ఉన్న క్రీడారంగానికి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు తనవంతు బాధ్యతలు చిత్తశుద్ధితో నిర్వహిస్తానని ముఖ్యమంత్రికి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

తిరుమలకు చేరుకున్న తెలంగాణ గవర్నర్



తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తితిదే డిప్యూటీ ఈవో ఆర్‌1 భాస్కర్

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి దర్శనార్థం తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ బుధవారం సాయంత్రం తిరుమలకు చేరుకున్నారు. స్థానిక శ్రీపద్మావతి అతిథిగృహం వద్ద గవర్నర్‌కు తితిదే డిప్యూటీ ఈవో ఆర్‌1 భాస్కర్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికి బస ఏర్పాట్లు చేశారు. గురువారం తెల్లవారుజామున తోమాల, అర్చన సేవల్లో శ్రీవారిని గవర్నర్ దర్శించుకోనున్నారు. డీఎస్పీ విజయ్‌శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులను మోసగించిన వ్యక్తిపై కేసు

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: శ్రీవారి భక్తులను మోసగించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని తితిదే విష్ణు నివాసం వసతి సముదాయం డిప్యూటీ ఈవో విజయకుమార్ ఫిర్యాదు చేశారు. తిరుపతి తూర్పు పీఎస్ ఎస్ఐ నరసింహ వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన రాజ్‌కుమార్, మూర్తి, వెంకటనారాయణ కుటుంబాలు వేర్వేరు తేదీల్లో తిరుపతికి వచ్చి విష్ణు నివాసంలో గదులు, లాకర్లు తీసుకున్నారు. దర్శనానంతరం లాకరు ఖాళీచేసి వెళ్లే సమయంలో సంబంధిత రసీదులు అక్కడ వదిలి వెళ్లారు. వాటిని సేకరించిన కర్ణాటక రాష్ట్రం ముల్‌బాగల్‌కు చెందిన తిలక్ శ్రీనివాస్ అనే వ్యక్తి.. ఆ ముగ్గురు భక్తులకు మూడునెలల తర్వాత ఫోన్‌చేసి గతంలో 'గతంలో మీరు విష్ణు నివాసంలో గదులు, లాకర్ తీసుకుని డిపాజిట్ చెల్లించకుండా వెళ్లిపోయారు. మీ ఆధార్ బ్లాక్ చేస్తున్నాం. మీకు, మీ కుటుంబ సభ్యులకు ఏడాది పాటు దర్శనాలు, ప్రసాదాలు ఇవ్వబోమ'ని చెప్పారు. కంగుతిన్న భక్తులు అతని చెప్పిన ఫోన్ నంబరుకు రూ.800, రూ.720, రూ.780 చెల్లించారు. రసీదును తితిదే విజిలెన్స్ విభాగానికి మెయిల్ చేసి చెప్పడంతో చివరకు తిరుపతి తూర్పు పీఎస్‌లో కేసు నమోదు చేశారు.


వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	124
రిటైల్	146
లేయర్	115
బ్రాయిలర్స్	212
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	242
లేయర్ మాంసం	195

జనవిజ్ఞాన వేదిక చెకుముకి పోటీలు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకుగాను నిర్వహించిన చెకుముకి పోటీల్లో బుధవారం జిల్లాలోని 350 ఉన్నత పాఠశాలల్లో 18 వేలమంది విద్యార్థులు పాల్గొన్నట్లు జిల్లా కార్యదర్శి ఎస్.రెడ్డెప్ప ఒక ప్రకటనలో తెలిపారు. మండల పట్టణ స్థాయిలో అక్టోబర్ 1న, జిల్లా స్థాయిలో అక్టోబర్ 27న పోటీలు జరుగుతాయని, రాష్ట్రస్థాయిలో నవంబర్ 9, 10న నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తిరుపతి పట్టణ కార్యదర్శి రఫీ, అధ్యక్షులు లక్ష్మీనారాయణ కార్యకర్తలు బాల, హర్షద్, గణేష్ పాల్గొన్నట్లు తెలిపారు.

మా పాపకు ప్రాణం పోయండి



మాట్లాడుతున్న తండ్రి మస్తాన్

తిరుపతి (భవానీనగర్), న్యూస్‌టుడే: మూడేళ్లుగా క్యాన్సర్‌తో బాధపడుతున్న తమ కుమార్తె అక్షయకు దాతలు, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రాణభిక్ష పెట్టాలని పిచ్చాటూరు మండలం ఓబులరాజు కండ్రిగకు చెందిన మస్తాన్, సునీత దంపతులు విజ్ఞప్తి చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. చికిత్స కోసం ఇప్పటివరకు రూ.14 లక్షలు ఖర్చు చేశామని, బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేస్తేనే పాపకు నయం అవుతుందని, అందుకుగాను రూ.20 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. తమకు ఆస్తులు లేవని, అప్పులు చేసి ఇప్పటి వరకు వైద్యం చేయించామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లు స్పందించి ప్రభుత్వం తరఫున ఆదుకోవాలని కోరారు.

పుత్తూరులో ఐపీ పెట్టిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి

పుత్తూరు, న్యూస్‌టుడే: తొరూరు గ్రామానికి చెందిన కృష్ణమూర్తి ఆర్టీసీలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేశాడు. పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో ఉంటున్నాడు. ఆయన స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో రూ.20.45 లక్షలకు ఐపీ దాఖలు చేశాడు. తాను తిరుత్తణిలో ఏర్పాటు చేసిన టెక్స్‌టైల్ వ్యాపారం కొవిడ్ వల్ల నష్టపోయానని, కొత్తగా ప్రారంభించిన చీటీల వ్యాపారంలో కూడా నష్టం వచ్చిందని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. వస్త్ర వ్యాపారం వల్ల తాను రూ.20.45లక్షలు అప్పులు చేశానన్నారు. వారి నుంచి ఒత్తిడి అధికమవడంతో ఐపీ దాఖలు చేసినట్లు పేర్కొన్నాడు. అయితే అతడు పథకం ప్రకారం ఉన్న ఆస్తులు విక్రయించి సొమ్ము చేసుకుని ఐపీ దాఖలు చేశాడని బాధితులు వాపోతున్నారు.

తిరువణ్ణామలై సర్వీసుల ఆదాయం రూ.28.15 లక్షలు

తిరుపతి(ఆర్టీసీ), న్యూస్‌టుడే: జిల్లా నుంచి తిరువణ్ణామలైకు నడిపిన ప్రత్యేక సర్వీసుల నుంచి రూ.28.15 లక్షల ఆదాయం వచ్చినట్లు తిరుపతి బస్‌స్టేషన్ ఏటీఎం డి.రామచంద్ర నాయుడు ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరులో మొత్తం 123 బస్సులతో 27,731 కి.మీ. నడిపినట్లు వివరించారు. కి.మీ.కు రూ.50.82 రాబడితో కలిపి మొత్తం రూ.28,14,406 ఆదాయం వచ్చిందన్నారు. ఆక్యుపెన్సీ రేషియో 82 శాతంగా నమోదైందన్నారు.

ఉమ్మడి జిల్లాలో 34మంది ఎంపీడీవోల బదిలీ

చిత్తూరు జడ్పీ, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలోని ఎంపీడీవోలను బదిలీ చేస్తూ జడ్పీ పూర్వ సీఈవోగా గ్లోరియా ఉత్తర్వులు జారీ చేశారు. 65 మండలాలకు గాను 18 మండలాల్లో ఎంపీడీవో పోస్టులు ఖాళీగా ఉండగా ఇన్‌ఛార్జుల పాలన నడుస్తోంది. ఇప్పుడు 34 మంది ఎంపీడీవోలను బదిలీ చేసినట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. మిగిలిన మండలాల్లో పనిచేసే ఎంపీడీవోలు బదిలీకి దరఖాస్తు చేసుకోకపోవడంతో వారు అక్కడే కొనసాగనున్నారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ ప్రాంతం
ఇందిరమ్మ	పుత్తూరు	రామచంద్రాపురం
అరుణ	నింద్ర	యర్రావారిపాళ్యం
ధనలక్ష్మి	పూతలపట్టు	ఐరాల
శివరాజు	యాదమరి	గుడిపాల
గంగయ్య	కలికిరి	కురబలకోట
తాజ్‌మసూర్	గుడుపల్లె	మదనపల్లె
శ్రీనివాసులు	రామచంద్రాపురం	చిత్తూరు
మహ్మద్‌రఫీ	వి.కోట	పిచ్చాటూరు
అబ్దుల్‌రహీం	పెద్దపంజాణి	కలకడ
చంద్రమౌళి	విజయపురం	కార్వేటినగరం
శేషగిరిరావు	నిమ్మనపల్లె	వడమాలపేట
భానుమూర్తిరావు	వడమాలపేట	కలికిరి
సురేంద్రనాథ్	తంబళ్లపల్లె	తొట్టంబేడు
సురేష్‌బాబు	తొట్టంబేడు	గంగవరం
సుధాకర్	చౌడేపల్లె	కేవీపల్లె
బాలాజీ	పీటీఎం	పెద్దపంజాణి
అబ్దుల్‌కలాంఆజాద్	తవణంపల్లె	సోమల
అమరనాథ్	యర్రావారిపాళ్యం	వెదురుకుప్పం
నాగరాజు	ఐరాల	పూతలపట్టు
హరినారాయణ	కురబలకోట	ములకలచెరువు
భానుప్రసాద్	మదనపల్లె	రామసముద్రం
పరమేశ్వరరెడ్డి	కలకడ	నిమ్మనపల్లె
మధుసూదనరెడ్డి	గంగవరం	రొంపిచెర్ల
ప్రేమ్‌రాజ్‌కుమార్	వెదురుకుప్పం	శాంతిపురం
లీలామాధవి	నగరి	గుడుపల్లె
రామచంద్ర	కేవీబీపురం	తిరుపతి గ్రామీణ
రమేష్‌బాబు	తిరుపతి గ్రామీణ	రేణిగుంట
గిడ్డయ్య	ఏర్పేడు	చిన్నగొట్టిగల్లు
ఉపేంద్రరెడ్డి	పీలేరు	తంబళ్లపల్లె
శివశంకర్	బంగారుపాళ్యం	పీలేరు
విష్ణుచిరంజీవి	రేణిగుంట	పీటీఎం
బాలాజీనాయక్	చంద్రగిరి	నాగలాపురం
సౌభాగ్యం	వైఎస్సార్ జిల్లా	ఏర్పేడు
లక్ష్మీకాంత్	విజయనగరం	రామకుప్పం

అజ్ఞాతంలోకి తూర్పు సీఐ

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: తిరుపతి తూర్పు పోలీస్ స్టేషన్ సీఐ మహేశ్వరరెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లారు. మంగళవారం రాత్రి తొమ్మిది గంటల వరకు అందుబాటులో ఉన్న ఆయన వాహనంలో రైల్వేకాలనీ వరకు వెళ్లారు. అక్కడ దిగాక స్టేషన్‌కు వెళ్లిపోమ్మని డ్రైవర్‌కు చెప్పి నడుచుకుంటూ వెళ్లినట్లు సమాచారం. తరువాత అధికారిక మొబైల్ ఫోను, సొంత ఫోన్ స్విచాఫ్ చేయడంతో పోలీసుల్లో ఒక్కసారిగా కలకలం రేగింది. విషయం తెలుసుకున్న ఎస్పీ సుబ్బరాయుడు ప్రత్యేక బృందాలతో సోదాలు చేయించారు. బుధవారం ఉదయం పది గంటల సమయంలో పోలీసు ఉన్నతాధికారులతో సీఐ మాట్లాడినట్లు సమాచారం. వైద్య పరీక్షల నిమిత్తం బెంగళూరు వెళ్లారని.. ఓ కేసు విచారణ నిమిత్తం కదిరికి వెళ్లారనే ప్రచారం జరిగిది. దీనిపై డీఎస్పీ వెంకటనారాయణను వివరణ కోరగా ఆయన అందుబాటులోకి వచ్చారని, పూర్వాపరాలు తెలియాల్సి ఉందన్నారు.

తిరుపతి

•తిరుపతి • చంద్రగిరి

ప్రతి పేదవాడికి నాణ్యమైన వైద్యం

రేణిగుంట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రతి పేదవాడికి నాణ్యమైన వైద్యం అందించడానికి కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని అత్తూరు గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో కేంద్రాన్ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. త్వరలో ఈ కేంద్రంలో హైటెక్ టెక్నాలజీని ఉపయోగించి వైద్యసేవలకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మునిచంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక నాయకులు నీలకంఠరెడ్డి, హరి, రేణిగుంట పట్టణాధ్యక్షుడు మహబుబ్‌బాషా, సీనియర్ నాయకులు మునస్వామినాయుడు, సుబ్రహ్మణ్యరెడ్డి, చిన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లాభసాటి వ్యవసాయంపై అవగాహన

యర్రావారిపాలెం, న్యూస్‌టుడే: నెరబైలు, చింతగుంట గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యానవనశాఖ అధికారిణి శివకుమారి, పశువైద్యాధికారి ఎం.కృష్ణకాంత్, వ్యవసాయశాఖ అధికారి ఖాదర్‌బాషా, సర్పంచి దేవేంద్ర, మార్కెట్ యార్డ్ మురళి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి : 80085 74561
పాకాల : 80085 74563

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే:

సమస్య: పద్మావతి మహిళా వర్సిటీ నుంచి ముత్యాలరెడ్డిపల్లె కూడలి వరకు నిర్మించిన మాస్టర్‌ప్లాన్ రోడ్డు(గంగమ్మ గుడి సీతమ్మమార్గం) చాలా ప్రమాదకరంగా మారింది. వేగ నిరోధకాలు లేకపోవడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఆకతాయిలు బైక్ రేసింగ్ నడుపుతుండటంతో పాదచారులు ఇబ్బంది పడుతున్నారు.
- హేమంత్ రాయల్, తెదేపా నేత

సమాధానం: సీతమ్మ మార్గంలో వేగనిరోధకాల ఏర్పాటు గురించి కమిషనర్‌తో చర్చించి వెంటనే ఏర్పాటు చేస్తాం.
- బి.మోహన్, ఎస్ఈ, నగరపాలిక

రామచంద్రాపురం, న్యూస్‌టుడే:

సమస్య: పీవీపురం పంచాయతీ బలిజపల్లిలో వీధి దీపాలు రాత్రింబవళ్లు వెలుగుతున్నాయి. స్విచ్‌లు ఏర్పాటు చేయటం మరిచారు.
- గ్రామస్థులు

సమాధానం: ఆన్ అండ్ ఆఫ్ స్విచ్‌లు లేనివాటిని ఏర్పాటు చేయిస్తాం.
-శ్రీకాంత్, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి

ఘనంగా జన్మదిన వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న నేతలు, కార్యకర్తలు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: రాష్ట్ర కనీస వేతనాల మాజీ సభ్యులు, తితిదే శ్రీహరి ఆలయ మాజీ డిప్యూటీ ఈవో చిన్నంగారి రమణ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. స్థానిక వరదరాజునగర్‌లోని ఆయన స్వగృహంలో జరిగిన వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ప్రముఖ సినీ నిర్మాత, తుడా మాజీ ఛైర్మన్ ఎన్వీ ప్రసాద్ తదితరులు పాల్గొని కేక్ కోసి శుభాకాంక్షలు తెలియజేశారు.

వ్యక్తిగత నైపుణ్యాలు పెంచుకోవాలి



మాట్లాడుతున్న ప్రదీప్

మంగళం(తిరుపతి) : ఎంచుకున్న లక్ష్యాలను సాధించడంలో ప్రతిఒక్కరూ వ్యక్తిగత నైపుణ్యాలు పెంచుకోవాలని ప్రముఖ నటుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు కొండిపర్తి ప్రదీప్ అన్నారు. అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస కార్యక్రమం నిర్వహించారు. జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు ప్రయత్నించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఛైర్మన్ సి.గంగిరెడ్డి, ప్రిన్సిపల్ సి.నాథమునిరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగ సాధనలో డేటా సైన్స్‌కు ప్రాధాన్యం

మహిళా వర్సిటీ(తిరుపతి): ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగ సాధనలో డేటా సైన్స్ ప్రాముఖ్యం ఎంతో ఉందని శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ నారాయణమ్మ పేర్కొన్నారు. కళాశాలలో బుధవారం ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్, బ్రింగ్ బ్యాక్ ఎడ్‌టెక్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో డేటా సైన్స్‌పై కార్యశాల నిర్వహించారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఉమారాణి పాల్గొని విద్యార్థినులకు అవగాహన కల్పించారు.

ఎస్వీయూలో రక్తదాన శిబిరాలు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా ఎస్వీయూ ఆరోగ్య కేంద్రంలో బుధవారం సిబ్బంది, విద్యార్థులు 45 మంది రక్తదానం చేశారు. వర్సిటీ వీసీ ఆచార్య అప్పారావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య దామోదరం, రోటరీ క్లబ్ అధ్యక్షులు సోమ రవికుమార్, పర్సనల్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల విభాగం ఆధ్వర్యంలో మరో 60 మంది రక్తదానం చేశారు. ప్రిన్సిపల్ సత్యనారాయణ, కోఆర్డినేటర్ శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

వసతుల వివరాలు నమోదు చేయాలి

పాకాల, న్యూస్‌టుడే: పాఠశాలలో మౌలిక వసతుల వివరాలను 'యూడైస్ ప్లస్' వెబ్‌సైట్‌లో విధిగా నమోదు చేయాలని ఎంఈవో బాబ్జీ సూచించారు. బుధవారం స్థానిక ఎంఆర్సీ కారాలయంలో నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడారు. ఎంఈవో-2 లింగయ్య పాల్గొన్నారు.



ఆర్టీసీ తిరుపతి కేంద్రీయ బస్‌స్టేషన్

బస్టాండులో నిఘా కళ్లు

29 సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

తిరుపతి(ఆర్టీసీ), న్యూస్‌టుడే: తిరుపతి కేంద్రీయ బస్ స్టేషన్‌లో పటిష్ఠ నిఘా సంతరించుకుంది. యాత్రికులను లక్ష్యం చేసుకొని దొంగలు ప్రయాణికుల్లో కలిసిపోయి వారి బ్యాగులు, సెల్‌ఫోన్లు, బంగారం దోచుకుంటున్న నేపథ్యంలో పోలీసుల సహకారంతో 29 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

తిరుపతి ప్రయాణ ప్రాంగణంలో శ్రీనివాస, శ్రీహరి, ఏడుకొండలు, పల్లెవెలుగు బస్టాండ్ల పరిధిలో 64 ప్లాట్‌ఫాంలు ఉన్నాయి. రోజుకు 1.15 లక్షల మంది ప్రయాణికులు ఇక్కడికి రాకపోకలు సాగిస్తున్నారు. వీరిలో 60 శాతం మంది శ్రీవారి దర్శనార్థం వచ్చే యాత్రికులే. వీరిని లక్ష్యంగా చేసుకుంటున్న దొంగలు వారి సెల్‌ఫోన్లు, బ్యాగులు, బంగారం అపహరిస్తున్నారు. రోజుకు 3 నుంచి 5 సెల్‌ఫోన్లు చోరీకి గురవుతున్నాయి. బాధిత ప్రయాణికులు బస్టాండ్‌లోని పోలీస్ అవుట్ పోస్టు, తూర్పు పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరిగినా ఫలితంగా ఉండేది కాదు. పోలీసులను సంప్రదిస్తే మొబైల్ హంట్ యాప్‌లో నమోదు చేసుకుంటే దొరికిన తర్వాత తిరిగి ఇస్తామని చెప్పడం తప్ప చేసేది ఏమీలేదు. కొంతమంది యాత్రికులు భాషా సమస్యతో ఫిర్యాదు ఇవ్వకుండానే వెళ్లిపోయిన దాఖలాలు ఉన్నాయి. బస్టాండ్లలో సీసీ కెమెరాల వ్యవస్థ సరిగ్గాలేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం.

◆ గత ఏడాది అక్టోబరు 3న తమిళనాడుకు చెందిన రెండేళ్ల బాలుడు అపహరణకు గురైన ప్రాంతంలో సీసీ కెమెరా పనిచేయకపోవడంతో సమీప దుకాణాలు, హోటళ్లలోని సీసీ కెమెరాలపై ఆధారపడి కేసు ఛేదించిన ఘటన చోటుచేసుకుంది.



ఏటీఎం ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన సీసీటీవీ

ప్రస్తుతం ఇలా..

ప్రస్తుతం అదనపు కెమెరాలతో పటిష్ఠమైన నిఘా వ్యవస్థను తీసుకొచ్చారు. ప్రస్తుతానికి 17 ఫేస్ రికగ్నైజ్డ్ కెమెరాలు పోలీస్ కమాండ్ కంట్రోల్ అధీనంలో ఉండగా, 12 బస్‌స్టేషన్ సహాయ ట్రాఫిక్ మేనేజర్ (ఏటీఎం) కార్యాలయానికి అనుసంధానం చేశారు. వీటితో భద్రతను నిత్యం పర్యవేక్షిస్తున్నారు. పాత నేరస్తులను గుర్తించడానికి పోలీసు కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో ప్రత్యేక సిబ్బందిని నియమించారు. త్వరలో మరో 10 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు.

మోసాల నియంత్రణపై అవగాహన

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: సైబర్ నేరగాళ్లు మొబైళ్ల ద్వారా ప్రకటనలు జారీచేసి మోసాలకు పాల్పడుతున్నారని సైబర్ వారియర్ మాధవరెడ్డి పేర్కొన్నారు. గొల్లపల్లి వద్ద ఉన్న సిద్దార్థ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. బాధితులు టోల్‌ఫ్రీ నంబరు 18002096789కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కళాశాల ఛైర్మన్ కొండారెడ్డి, కార్యదర్శి ఆనందరెడ్డి, విజయరెడ్డి, ప్రిన్సిపల్ రాజశేఖర్ పాల్గొన్నారు.



కేకు కోస్తున్న శ్యాంసుందర్ తదితరులు

శ్రీచైత్ర ఆసుపత్రి వార్షికోత్సవం

తిరుపతి (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: స్థానిక అశోకనగర్‌లోని శ్రీచైత్ర ఆసుపత్రి వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఆసుపత్రి అధినేతలు డా.శ్యాంసుందర్, డా.లక్ష్మీప్రసన్న కేకు కోసి సంబరాల్లో పాల్గొన్నారు. యూరాలజీ, గైనకాలజీతోపాటు అన్ని రకాల వ్యాధులకు అధునాతన వైద్యసేవలు అందిస్తున్నట్లు వారు చెప్పారు.

వాహనాల వేలంలో రూ.17.78 లక్షల ఆదాయం

జీవకోన(తిరుపతి),న్యూస్‌టుడే: తిరుపతి సర్కిల్ పరిధిలో ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడిన వాహనాలకు బుధవారం జిల్లా అటవీశాఖ అధికారి జి.సతీష్‌రెడ్డి నేతృత్వంలో వేలం నిర్వహించారు. 50 వాహనాలకు వేలం నిర్వహించగా 45 వాహనాలు అమ్ముడుపోయి రూ.17.78 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆయన వెల్లడించారు.

అదనపు ఈవో తనిఖీలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు అక్టోబరు 4 నుంచి 12 వరకు జరుగనున్న సందర్భంగా ఏర్పాట్లపై తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి బుధవారం తనిఖీలు నిర్వహించారు. అక్టోబరు 4న శ్రీవారి బ్రహ్మోత్సవాల మొదటి రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరుమల పర్యటన దృష్ట్యా శ్రీపద్మావతి అతిథి గృహంలో సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం పాంచజన్యం, వకుళామాత కేంద్రీయ వంటశాలలో వంటసామగ్రిని, ఆహారపదార్థాల పట్టికను పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో సీఈ సత్యనారాయణ, ఉద్యానవనశాఖ డీడీ శ్రీనివాసులు, అటవీశాఖ డీఎఫ్‌వో శ్రీనివాస్, డిప్యూటీ ఈవోలు రాజేంద్ర, ఆశాజ్యోతి, క్యాటరింగ్ ప్రత్యేకాధికారి జీఎల్ఎన్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



శ్రీపద్మావతి అతిథి గృహం పరిశీలిస్తున్న తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, అధికారులు



ప్రజావేదికలో కూటమి నేతలను సత్కరిస్తున్న డివిజన్ నాయకులు

అభివృద్ధి, సంక్షేమం వైపు పరుగులు

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పాలనతో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని బుధవారం నెహ్రూనగర్ ఐ.ఎస్.మహల్ వద్ద నిర్వహించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, పసుపులేటి హరిప్రసాద్, వూకా విజయ్‌కుమార్, భాస్కర్‌యాదవ్, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఘనంగా దీన్‌దయాళ్ జయంతి

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక తపాలా కార్యాలయం వద్ద బుధవారం భాజపా సాంస్కృతి విభాగం జిల్లా కన్వీనర్ గుండాల గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి అంజలి ఘటించారు. చంద్రబాబు యాదవ్, సుబ్రహ్మణ్యం రెడ్డి, నాదముని, చెంగల్రాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శన

మహిళా వర్సిటీ(తిరుపతి): శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్-22 యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా వర్సిటీ ఫ్యాషన్ టెక్నాలజీ అండ్ అప్పరల్ డిజైనింగ్ కోర్సు విద్యార్థినులు బుధవారం వేస్ట్ మెటీరియల్స్‌తో తయారు చేసిన వివిధ రకాల వస్తువుల ప్రదర్శనను నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ విద్యావతి, గృహ విజ్ఞానశాస్త్ర విభాగాధిపతి బిందు, అధ్యాపకులు దేవి, హబీబుల్లా పాల్గొన్నారు.

కాలువ గడ్డా.. చేసేయ్ కబ్జా



చెంచులక్ష్మి కాలనీలో కాలువ పూడ్చి పక్కనే నిర్మించిన షెడ్లు



భాగ్యనగరం వద్ద కశిం కాలువ గడ్డపై వెలసిన నిర్మాణాలు

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: కాలువల కబ్జా ఆగడం లేదు. వేదాంతపురం పంచాయతీలోని చెంచులక్ష్మి కాలనీ దినదినాభివృద్ధి చెంది జాతీయ రహదారి సమీపంలోని భూములకు డిమాండు ఏర్పడింది. కాలనీకి తూర్పుగా ఉన్న కాలువపై స్థానిక నాయకుల కన్నుపడింది. ఇక్కడ అంకణం రూ.2 లక్షలు పలుకుతుంది. సర్వే నం. 370లోని కాలువగడ్డను గతంలో ఆక్రమించి ఇళ్లు నిర్మించేశారు. మిగిలిన కాలువ విలువ సుమారు రూ.కోటి ఉంటుంది. అందులోనే కాలనీలోని మురుగునీరు వెళ్లాల్సి ఉంది. నాయకులు పూడ్చేసి రోడ్డుగా మార్చడంతోడు ఓవైపు షెడ్లు నిర్మించారు. స్థానికులు స్పందిస్తూ కాలువ పూడ్చేస్తే మురుగునీరు ఎటు వెళ్లాలని అడ్డుకోవడంతో బుధవారం ఘర్షణ చోటుచేసుకుంది. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడటం లేదు. కూపుచంద్రపేట పంచాయతీ భాగ్యనగరంలో కశిం కాలువ విస్తరించగా రెవెన్యూ అధికారి గడ్డను చదును చేసి వంద అంకణాల్లో ఐదు షెడ్లను నిర్మించేశారు. స్థానికులు వారించినా రెవెన్యూ అధికారి కావడంతో ఏమీచేయలేక మిన్నకుండిపోయారు. ఆక్రమణల విలువ రూ.50 లక్షలు ఉంటుంది. విద్యుత్తు మీటర్లు బిగించారు. షెడ్లకు దూరంలో 17 ఏళ్లుగా పేద కుటుంబం షెడ్డులో జీవనం సాగిస్తుండగా విద్యుత్తు మీటరు కావాలని ఆశాఖ అధికారులను విన్నవించినా పట్టించుకోలేదు. కాలువల ఆక్రమణ విషయం తమ దృష్టికి వచ్చిందని, సర్వే చేయించి ఆక్రమించి ఉంటే తొలగిస్తామని తహసీల్దార్ రామాంజనేయులు నాయక్ తెలిపారు.

'జగన్ పాలనలో హిందువులకు భరోసా కరవు'

తిరుపతి(భవానీనగర్), న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ హయాంలో హిందూ దేవాలయాలపై అనేక దాడులు, విగ్రహాల ధ్వంసం చేశారని, అప్పట్లో సీఎంగా ఉన్న జగన్‌మోహన్ రెడ్డి హిందువులకు భరోసాగా ఒక్క ప్రకటనైనా చేశారా అని ఏపీ సాధుపరిషత్ అధ్యక్షులు ఆనందాశ్రమ పీఠాధిపతి శ్రీనివాసనంద స్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. సాధు పరిషత్ ఆధ్వర్యంలో తిరుమల క్షేత్రాన్ని విరాజిల్లేలా చేస్తామన్నారు. హిందూవుల మనోభావాలను దెబ్బతీసేలా కల్తీ నెయ్యి ఘటన జరిగిందని, దీని వెనుక ఉన్న ఎంతటి వారినైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెడ్డిశేఖర్ రాయల్, గణేష్ స్వామి, జ్యోతిస్వరూపానంద స్వామి తదితరులు పాల్గొన్నారు.

రసాయనాలతో నేల సాంద్రత తగ్గుముఖం

మహిళా వర్సిటీ(తిరుపతి): పంటల్లో రసాయనాలు, పెస్టిసైడ్లు వాడటంవల్ల నేలలో సాంద్రత తగ్గిపోతుందని, ప్రజారోగ్యంపైన దుష్ప్రభావాలు చూపిస్తాయని శ్రీపద్మావతి మహిళా వర్సిటీ సెరికల్చర్ విభాగం ఆచార్యులు సావిత్రి, సుజాత అన్నారు. వర్సిటీ మహిళా అధ్యయన విభాగం, బయోసైన్స్ అండ్ సెరికల్చర్ విభాగం, న్యాయ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో వేమూరు గ్రామంలో బుధవారం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ప్రాజెక్టు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ నీరజ, డీఆర్‌డీఏ ఇన్‌ఛార్జి సంచాలకులు ప్రభావతి అవగాహన కల్పించారు.

మాస్టర్‌ప్లాన్ రోడ్డా.. పార్కింగ్ స్థలమా?

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: తితిదే పరిపాలన భవనం సమీపంలో నగరపాలిక నిధులతో నిర్మించిన మాస్టర్‌ప్లాన్ రోడ్డు నిండా వాహనాలు నిలిపి ఉంచడంపై కమిషనర్ మౌర్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ ఫిర్యాదు మేరకు బుధవారం ఉదయం ఆమె అధికారులతో తనిఖీ చేశారు. నగరపాలిక నిధులు రూ.5 కోట్లకు పైగా వెచ్చించి నిర్మించిన రోడ్డుపై వాహనాలను నిలిపి ఇరుకు రోడ్డుగా మార్చడం ఏంటని ఆమె ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆర్సీ మునికృష్ణ భవానీనగర్‌లోని యూడీఎస్, రోడ్డు, నీటి పైప్‌లైన్ల సమస్యను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. మాజీ కౌన్సిలర్ నాగభూషణం, డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్, నాయకులు శ్రీలక్ష్మీ, రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీబీ వర్ధంతి

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని రాయలసీమ రంగస్థలి కళాకారులు బుధవారం తిరుపతి ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. గూండాల గోపినాథ్ రెడ్డి, కేఎన్ రాజా, పద్మనాభం, సుబ్రహ్మణ్యంరెడ్డి, చెంగల్ రాయులు, నాదముని, యువరాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విద్యా విధానంతో నష్టం

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఆలిండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ (ఏఐఎస్ఈసీ) ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ కాలనీలోని అంబేడ్కర్ భవన్‌లో 'జాతీయ విద్యా విధానం - 2020 అమలు, నేటి విద్యావ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలు, మన ముందున్న కర్తవ్యాలు' అనే అంశంపై బుధవారం సదస్సు నిర్వహించారు. కమిటీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యుడు ఎ.హరీష్, రాష్ట్ర కార్యదర్శి ఎం.సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. నాలుగేళ్ల డిగ్రీతో విద్యార్థులకు ఒరిగేదేమీ లేదన్నారు. శ్రీకాంత్, అమీనా, విద్యార్థి సంఘం నేతలు మహేష్, నవీన్, డిల్లి, మహేశ్వర్, వెంకటేష్, బాలాజీ విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం కేసుల్లో 30 మందికి జరిమానా

తిరుపతి (లీగల్): నగరంలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 30 మంది నిందితులు ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానా విధిస్తూ నాలుగో అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు వెలువరించినట్లు కోర్టు పర్యవేక్షకులు సుబ్బారెడ్డి, కోర్టు పోలీసు గిరి తెలిపారు. ఇద్దరు ఆటో డ్రైవర్లు ఎం.పవన్ కుమార్, ఎం.కార్తీక్‌లకు జరిమానాతోపాటు మూడు రోజుల జైలుశిక్ష..ద్విచక్ర వాహన చోదకులు ఎం.నరేష్ బాబు, సి.బాలాజీకి రెండు రోజులు చొప్పున జైలుశిక్ష విధించారు.

తిరుమలలో వాహన తనిఖీలు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల ట్రాఫిక్ పోలీసులు, తిరుపతి ఆర్టీవో అధికారులు బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. స్థానిక జీఎన్సీ టోల్‌గేట్ వద్ద చేపట్టిన తనిఖీల్లో భాగంగా అధికారులు వాహనాల రికార్డులను, ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్సు, పొల్యూషన్ రికార్డులను పరిశీలించారు. ఏడు వాహనాలకు రూ.45,700 జరిమానా విధించారు. సీఐ హరిప్రసాద్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ వర్మ పాల్గొన్నారు.

పాపాలకు శిక్ష తప్పదు: ఎమ్మెల్యే

తిరుపతి (బైరాగిపట్టెడ, మంగళం), న్యూస్‌టుడే: శ్రీవారి నెయ్యి కొనుగోళ్ల విషయంలో అవకతవకలకు పాల్పడిన వారికి శిక్షలు తప్పవని స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా సతీసమేతంగా బుధవారం ఆటోనగర్‌లోని శివాలయంలో మహా హోమంలో పాల్గొన్నారు.

గుట్టలెక్కుతున్న ఆక్రమణలు



బంగారం కంటే భూమి విలువలు పెరిగిపోతూ ఉండటంతో అక్రమార్కులు కొండలు..గుట్టలు సైతం వదలడం లేదు. భారీ యంత్రాలను ఉపయోగించి గ్రావెల్ అక్రమంగా తరలించడంతోపాటు ఆయా ప్రాంతాలను ఆక్రమించేస్తున్నారు. యర్రావారిపాలెం మండలంలోని యల్లమంద పంచాయతీ మర్రిమాకులపల్లికి చెందిన కొందరు భారీ యంత్రాల సాయంతో గుట్టలు చదును చేస్తున్నారు. సర్వే నంబరు 692లో సుమారు 300 ఎకరాలు కొండ, గుట్టలు విస్తరించి ఉన్నాయి. దీన్ని అదునుగా భావించి ఆక్రమణకు పాల్పడ్డారు. ఈ విషయమై 'న్యూస్‌టుడే' రెవెన్యూ అధికారులను వివరణ కోరగా సిబ్బందిని పంపించి పనులు నిలిపివేసినట్లు తెలిపారు.

- న్యూస్‌టుడే, యర్రావారిపాలెం

ఎర్ర చందనం పట్టివేత



జ్యోతీశ్వరరెడ్డి, గణేశన్

తిరుత్తణి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ నుంచి చెన్నైకి మినీ లారీలో అక్రమంగా తరలిస్తున్న రూ.50 లక్షల విలువ చేసే ఎర్ర చందనాన్ని తిరుత్తణి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఉదయం తిరుత్తణి సమీపంలోని తిరుపతి జాతీయ రహదారిలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో ఆంధ్రప్రదేశ్ నుంచి తిరుత్తణికి వస్తున్న ఓ వ్యానులో తనిఖీ చేయగా సుమారు రెండు టన్నుల బరువున్న ఎర్రచందనం ఉండటాన్ని గుర్తించారు. వాటిని తరలిస్తున్న చిత్తూరుకు చెందిన గణేశన్(45), జోతీశ్వర్‌రెడ్డి(44)లను అరెస్టు చేసి విచారణ చేస్తున్నారు. **జీవకోన (తిరుపతి) :** నెల్లూరు జిల్లా రాపూరు అడవుల్లో నిర్వహించిన దాడుల్లో 15 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ బుధవారం ప్రకటనలో తెలిపారు. స్మగ్లర్ గోనుపల్లికి చెందిన వ్యక్తిగా గుర్తించామని చెప్పారు.

పోటీల్లో ప్రతిభ చాటాలి

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: విద్యార్థులు అత్యుత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్ర, జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ చాటాలని జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్ పేర్కొన్నారు. ముత్యాలరెడ్డిపల్లిలోని ఈఎంఆర్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి అండర్-14,-17,-19 తైక్వాండో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో తిరుపతి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి బాలాజీ, ప్రధానోపాధ్యాయుడు వంశీరాజా, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు జయరామయ్య, బాబు, పీడీలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

యర్రావారిపాలెం: చంద్రగిరి ప్రభుత్వ పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నియోజకవర్గ స్థాయి క్రీడల్లో తమ పాఠశాల విద్యార్థినులు 11 మంది ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ పరిమళ తెలిపారు. అండర్ 14 కబడ్డీ, ఖోఖో విభాగంలో ఇద్దరు, అండర్ 17 విభాగంలో ఇద్దరు, అథ్లెటిక్స్‌లో ఏడుగురు ఎంపికైనట్లు చెప్పారు. వారిని వ్యాయామ ఉపాధ్యాయిని సుజాత, ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు.

200 మందికి అర్హత

చంద్రగిరి, న్యూస్‌టుడే: చంద్రగిరిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఏపీ స్కూల్ గేమ్స్-2024 నియోజకవర్గస్థాయి పోటీలు ముగిశాయి. అండర్ 14, అండర్-17 విభాగాల్లో వాలీబాల్, యోగ, కబడ్డీ, ఖో-ఖో, యోగా, అథ్లెటిక్స్ పోటీలకు 1,200 మంది హాజరయ్యారు. ప్రతిభ చూపిన 223 మంది విద్యార్థులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. హెచ్‌ఎం విజయ, కోఆర్డినేటర్ శరత్‌చంద్ర, పీడీలు మదన్‌మోహన్, మునిశేఖర్, సుబ్రహ్మణ్యంరెడ్డి, నిరంజన్‌రెడ్డి, భానుప్రసాద్ హాజరయ్యారు.

శ్రీకాళహస్తి
• శ్రీకాళహస్తి • సత్యవేడు

తనిఖీల కొనసాగింపు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవోగా బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్ ఆజాద్ ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తున్నారు. బుధవారం వేకువజామున 4 గంటలకే దక్షిణ గోపురం వద్ద ప్రవేశ గోపురాల వద్దకు చేరుకున్నారు. అక్కడ నుంచి అన్నీ ప్రవేశ గోపురాలు పరిశీలించారు. ప్రధానంగా తిరుమంజన గోపురం వద్ద ఏర్పాటు చేసిన మెట్ల వద్ద, భిక్షాల గాలిగోపురం సమీపంలోని మర్రి చెట్టు వద్ద చెత్త పేరుకుపోవడం, దుర్గంధంగా ఉండటంతో తక్షణం చెత్తను తొలగించాలని సూచించారు. ఆర్జిత సేవా కౌంటర్లల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు కూడా డ్రెస్ కోడ్ పాటించాలని, విధిగా బొట్టు పెట్టుకోవాలంటూ సూచనలు చేశారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుకాణాల కారణంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలంటూ అధికారులను ఆదేశించారు.

వర్షంతో పరుగో.. పరుగు



పట్టణంలోని చతుర్మాడ వీధులు ఒక్కసారిగా ఖాళీ అయ్యాయి. బుధవారం సాయంత్రం భారీ చినుకులతో స్వల్ప సమయం వర్షం పడింది. అప్పటి వరకు రోడ్లపై ఉన్న వారు వర్షం దెబ్బకు పరుగులు తీశారు. ఎక్కడ వీలుంటే అక్కడి అంగళ్ల వద్దకు వెళ్లిపోయారు. వర్షం ఆగిపోవడంతో మళ్లీ యథా ప్రకారం సందడి వాతావరణం నెలకొంది. - న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

ప్రజా సంక్షేమానికి బాసటగా కూటమి

నారాయణవనం, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమానికి బాసటగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని గోవిందప్పనాయుడు కండ్రిగలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల్లో అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సచివాలయం సిబ్బంది, అధికారులు వివరించి, వారి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కార చర్యలు తీసుకోవాలన్నారు. ఇది మంచి ప్రభుత్వం స్టికర్‌ను ప్రతి ఇంటికి అంటించాలని సూచించారు. ఇన్‌ఛార్జి ఎంపీడీఓ గుణశేఖర్, తహసీల్దార్ జయరాములు, ప్రజా ప్రతినిధులు, తెదేపా నాయకులు, అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



విజన్-2047 ప్రజా అభిప్రాయ సేకరణను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

చెరువుల్లో ఆగని ఆక్రమణలు

రెవెన్యూ ఆదేశాలు బేఖాతరు



చెరువును పరిశీలిస్తున్న డీఈ ప్రకాష్‌రావు, గ్రామస్థులు

తొట్టంబేడు, న్యూస్‌టుడే: మండలంలోని చెరువులు, గుంటలు, కాలువలు, ప్రభుత్వ భూములు ఇలా ఏదీ ఖాళీగా కన్పిస్తే వాటిని కబ్జా చేసేందుకు అక్రమార్కులు వెనుకాడటం లేదు. యథేచ్ఛగా చెరువుల ఆక్రమణల పరంపర కొనసాగుతోంది. భూముల ధరలు పెరగడమే కాకుండా ఈ ప్రాంతంలో పలు పరిశ్రమలు ఏర్పాటు కావడం, కొత్తగా మరికొన్ని వచ్చే అవకాశం ఉండటంతో కబ్జాదారులు చెరువులను ఆక్రమించడం లక్ష్యంగా చేసుకున్నారు. కొన్ని చోట్ల చిన్న చెరువులను సైతం ఆక్రమించి ఆనవాళ్లు లేకుండా చేశారు. దీంతో ప్రభుత్వ భూముల సంరక్షణ ప్రశ్నార్థకంగా మారుతోంది. మండలంలోని చోడవరం పంచాయతీ పెద్దగుంట గ్రామ సర్వే నంబరు 27లో 79.60 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువును పలువురు కబ్జాదారులు 25 ఎకరాలను ఆక్రమించి సాగు చేసేందుకు యత్నిస్తున్నారు. దీంతో ఆక్రమణదారుల నుంచి చెరువును కాపాడాలంటూ ఏళ్లుగా ఆ గ్రామ రైతులు పోరాటం చేస్తుండటం గమనార్హం.

● చోడవరం పంచాయతీ పెద్దగుంట చెరువును అక్రమార్కుల నుంచి కాపాడుకునేందుకు రైతులు 32 ఏళ్లుగా పోరాటం చేస్తున్నారు. 1992లో ప్రారంభమైన ఆక్రమణల తంతు కొనసాగుతోంది. గ్రామ సర్వే నంబర్ 27లో 79.60 ఎకరాల విస్తీర్ణం చెరువులో స్థానికులు కొందరు ఆక్రమించి సాగు చేపట్టగా రైతుల పోరాటంతో ఐదేళ్ల క్రితం అప్పటి తహసీల్దార్ సర్వేచేసి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి కంచెను తొలగించారు. ఆక్రమణదారులు రెవెన్యూ అధికారుల ఆదేశాలు బేఖాతరు చేస్తూ మళ్లీ ఆక్రమణకు పాల్పడుతున్నారు. కబ్జా చేసిన చెరువు భూమిలో బోరు వేయడమే కాకుండా తప్పుడు సర్వే నంబర్లతో విద్యుత్తు శాఖ నుంచి స్తంభాలు, నియంత్రిక పొందారు. తమ చెరువు నీటి ఆధారంగానే వ్యవసాయం చేసి జీవిస్తున్నామని రైతులు అంటున్నారు. ఆక్రమణలు అడ్డుకున్న గ్రామస్థులపై కబ్జాదారులు దాడి చేస్తున్నారని వాపోయారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశామని, శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆక్రమణలతో నిట్టూర్పు

మండలంలోని కాసరం చెరువులో దాదాపు 100 ఎకరాలు ఆక్రమించడంతో రూపురేఖలు కోల్పోయింది. రాంబట్టపల్లి చెరువులో 45 ఎకరాలు, గొట్టిపూడి చెరువులో 30 ఎకరాలు, కొండ్రాజుపల్లి చెరువులో 28 ఎకరాలను ఆక్రమించి వరిసాగు చేస్తున్నారు. యుడుపల్లి చెరువులో తాజాగా మూడు ఎకరాలు ఆక్రమించేశారు. ఇదే కాకుండా మండలంలో మరి కొన్ని చెరువులు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లాయి.

చర్యలు తీసుకుంటాం

మండలంలోని పెద్దగుంట గ్రామస్థుల ఫిర్యాదు మేరకు చెరువును ఇటీవల పరిశీలించాం. చెరువు ఆక్రమణ దారులను పలుమార్లు హెచ్చరించాం. చెరువులు, కాలువల ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.
- మునిమోహన్, నీటిపారుదల శాఖ, ఏఈ, తొట్టంబేడు



చెరువు భూమిలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు



చెరువులో వేసిన విద్యుత్తు బోరు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

రేణిగుంట, న్యూస్‌టుడే

సమస్య: రేణిగుంట పంచాయతీలోని జ్యోతి నగర్‌లో కాలువలు లేక ఇబ్బందిగా ఉంది. పంచాయతీ పెద్దలు ఇక్కడ కాలువలు నిర్మించాలి. - **అమర్, స్థానికుడు**

సమాధానం: ఇక్కడ నెలకొన్న సమస్యను పరిశీలించాం. త్వరలో తగు చర్యలు తీసుకుంటాం. - **నరేశ్, సర్పంచి**

న్యూస్‌టుడే, తొట్టంబేడు

సమస్య: విరూపాక్షపురం ప్రాథమిక పాఠశాల సమీపంలోని తాగునీటి బోరు చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి, పైపు పగడంతో పాటు నీరు నిలుస్తోంది. అధికారులు చర్యలు తీసుకోవాలి. - **రవిబాబు, స్థానికుడు**

సమాధానం: పిచ్చి మొక్కలు తొలగించి, పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. - **సురేష్‌బాబు, ఎంపీడీవో**

30న ఛలో కలెక్టరేట్.. సత్యవేడు: తమకు రావాల్సిన బకాయిలు చెల్లించలేదన్న కారణంగా సీఐటీయూ అనుబంధ స్థానిక హరిత రాయబారులు ఈ నెల 30న తేదీన తిరుపతి కలెక్టరేట్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు శేఖర్, మునస్వామి తెలిపారు. బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయం ఎదుట తమ జీతాలు తమకు అందేలా చర్యలు తీసుకోవాలని నిరసన వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త శ్రీపతిబాబు

సంక్షోభంలోనూ సంక్షేమం

నాగలాపురం : వైకాపా రాష్ట్రంలో సృష్టించిన సంక్షోభ సమయంలోనూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సంక్షేమ పాలన సాగించడం తెదేపాతోనే సాధ్యమని తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త శ్రీపతిబాబు పేర్కొన్నారు. మండలంలోని ఎస్ఎస్‌పురంలో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాసులుయాదవ్, సర్పంచి కృష్ణయ్యశెట్టి, మాజీ సర్పంచి మాతయ్య, నేతలు ఉప్పు సురేష్‌యాదవ్, పార్థిబన్ తదితరులు పాల్గొన్నారు. **సత్యవేడు:** మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేసిన మోసం ఇప్పటి వరకు ఈ రాష్ట్రాన్ని పరిపాలించిన ముఖ్యమంత్రులు ఎవరు చేయలేదని, ఇంతటి పాపం జగన్‌ను విడిచి పెట్టదని తెదేపా నియోజకవర్గ కో-ఆర్డినేటర్ డా. శ్రీపతి బాబు విమర్శించారు. బుధవారం మండలంలోని పెద్దఈటిపాకం గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' అనే కార్యక్రమానికి ఆయన హాజరై ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచిపెట్టారు. తెదేపా,జనసేన, భాజపా మండలాధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, ప్రతాప్, రూపేష్, సీనియర్ నాయకుడు సుందరరామిరెడ్డి, నాయకులు పరమశివం, ఎంపీడీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

ప్రతి పేదవాడికి నాణ్యమైన వైద్యం

రేణిగుంట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రతి పేదవాడికి నాణ్యమైన వైద్యం అందించడానికి కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని అత్తూరు గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో కేంద్రాన్ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. త్వరలో ఈ కేంద్రంలో హైటెక్ టెక్నాలజీని ఉపయోగించి వైద్యసేవలకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మునిచంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక నాయకులు నీలకంఠరెడ్డి, హరి, రేణిగుంట పట్టణాధ్యక్షుడు మహబుబ్‌బాషా, సీనియర్ నాయకులు మునస్వామి నాయుడు, సుబ్రహ్మణ్యరెడ్డి, చిన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించండి

తొట్టంబేడు : రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి తెలిపారు. ప్రాంతీయ ఆసుపత్రిని స్థానిక నేతలతో కలిసి బుధవారం తనిఖీ చేశారు. పలు వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడి.. వారికి అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో మందుల కొరత లేకుండా చూడాలని వైద్యులకు సూచించారు. అన్నా క్యాంటీన్ సందర్శించి ఆహారాన్ని పరిశీలించారు. ఆసుపత్రి పర్యవేక్షకురాలు విజయలక్ష్మి, నేతలు మునిరాజా నాయుడు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై సేద్య పరికరాలు

నాగలాపురం, న్యూస్‌టుడే: రైతులకు 90 శాతం రాయితీపై బిందు, తుంపర్ల సేద్యం పరికరాలు అందిస్తామని సూక్ష్మనీటిసాగు పీడీ సతీష్ పేర్కొన్నారు. నాగలాపురం మండలంలోని వడ్లకుప్పం, కృష్ణాపురం, పిచ్చాటూరు మండలంలోని ముడియూరు, గొల్లకండ్రిగ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పొలాల్లో రైతులతో కలసి అధికారులు వరినాట్లు వేసి మెలకువలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్సీ లక్ష్మీదేవి, ఏవోలు సుబ్బారావు, సంజీవరెడ్డి, పశువైద్యాధికారులు ప్రదీప్‌కుమార్, మౌనిక, తెదేపా మండలాధ్యక్షుడు శ్రీనివాసులుయాదవ్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి పాల్గొన్నారు.



పూల తోటలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

సేంద్రియ ఎరువులతో సత్ఫలితాలు

శ్రీకాళహస్తి(గ్రామీణం)(ఏర్పేడు) : సేంద్రియ ఎరువులతో నాణ్యమైన దిగుబడులను సాధించవచ్చునని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావు తెలిపారు. శ్రీకాళహస్తి మండలంలోని మేలచ్చూరులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానశాఖ అధికారులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించడంతో పాటు రైతులు సాగుచేసిన పూల తోటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఏలు ధనంజయరెడ్డి, రమేష్‌రెడ్డి, ఏవో సుధాకర్‌రెడ్డి, పుష్పలత పాల్గొన్నారు. ● వ్యవసాయంతో పాటు పశుపోషణతో రైతులు సులభతరంగా ఆర్థిక ప్రగతిని సాధించవచ్చునని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డా. రవికుమార్ తెలిపారు. శ్రీకాళహస్తి మండలంలోని ముచ్చువోలులో బుధవారం పశుగణాభివృద్ధి సంస్థ, రాష్ట్రీయ గోకుల మిషన్ పథకం ఆధ్వర్యంలో పశువైద్యశిబిరం, లేగదూడల ప్రదర్శన చేపట్టారు. 32 లేగదూడలు ప్రదర్శనలో పాల్గొనగా ఉత్తమ జాతి లక్షణాల గల దూడలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ బాలసుబ్రహ్మణ్యం, ఏడీ డా. శ్రీకాంత్‌బాబు, డా. ఉష, గుణశేఖర్, ఊహ తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో శాంతిహోమం నిర్వహిస్తున్న అర్చకులు, పురోహితులు, వేదపండితులు

ఆగమోక్తంగా శాంతిహోమం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శాంతి హోమాన్ని ఆద్యంతం ఆగమోక్తంగా నిర్వహించారు. శివుని జన్మనక్షత్రమైన ఆరుద్రను పురస్కరించుకుని బుధవారం అచ్యుతరాయ మండపంలో ఈ ఉత్సవాన్ని జరిపారు. తిరుమల లడ్డూ తయారీలో కల్తీ వినియోగంపై తితిదే ప్రాయశ్చిత హోమాన్ని నిర్వహించిన విషయం తెలిసిందే. అదే రీతిలో అన్నీ ఆలయాల్లో శాంతి హోమాలు జరపాలని దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. ఇన్‌ఛార్జి ఈవో చంద్రశేఖర్ ఆజాద్ సమక్షంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అభిషేక గురుకుల్ నిరంజన్ యాగపూజలు చేపట్టారు. ధూప, దీప, నివేదనలు పూర్తయ్యాక యాగ కలశాల్లోని పవిత్ర జలాన్ని ఆలయంతో పాటు ప్రసాదాల తయారు చేసే పోటు, లడ్డూ పోటు, ప్రవేశ గోపురాలు, మండపాలు, పరిపాలన భవనం ప్రాంతాల్లో సంప్రోక్షణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన గురుకుల్ సంబంధం, కరుణ, డిప్యూటీ ఈవో ఎన్. ఆర్. కృష్ణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

రేణిగుంటలో ..

రేణిగుంట, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి లడ్డు తయారీలో జంతువుల కొవ్వు పదార్థాలను వాడి అపవిత్రం చేయడంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చేస్తున్న ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ బాధ్యురాలు కోటా వినుత హోమం చేపట్టారు. బుధవారం స్థానిక శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో హోమం నిర్వహించారు. ఈ దీక్షల్లో స్థానిక ముస్లీమ్ మహిళలు పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని, ఇదే నిజమైన సెక్యులరిజం అని ఆమె తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు ల్యాబ్ భాస్కర్, చంద్రబాబు పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న వినుత కోటా దంపతులు, జనసేన నాయకులు

ఆకట్టుకునేలా అంగన్‌వాడీలను తీర్చిదిద్దాలి

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: పిల్లలకు భాషాభివృద్ధి, శాస్త్రీయ పరిజ్ఞానంపై ఆకర్షితులయ్యేలా అభినయ గేయాలతో మెదడుకు పదునెక్కించేలా వినూత్న బోధనతో అంగన్‌వాడీలను తీర్చిదిద్దాలని సీడీపీవో దేవకుమారి పిలుపునిచ్చారు. వరదయ్యపాళెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం మండల వ్యాప్తంగా గల అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రజాప్రగతి ట్రస్ట్ ఆధ్వర్యంలో పిల్లలకు నైపుణ్య బోధనపై శిక్షణ తరగతులను నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు యమున, జ్యోతి, ప్రజాప్రగతి ట్రస్టు మండల సమన్వయకర్త సుబ్రహ్మణ్యం, శిక్షణ అధికారి చెంచురామిరెడ్డి, ట్రస్టు ప్రతినిధులు ఓంకార్, గంగయ్య, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో సత్తాచాటాలి

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: విద్యతో పాటు, క్రీడల్లోనూ రాణించి జాతీయస్థాయి క్రీడాకారులుగా ప్రతిభ చాటాలని జడ్పీటీసీ సభ్యులు వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయుడు రమణయ్య పిలుపునిచ్చారు. వరదయ్యపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం నియోజకవర్గ స్థాయి ఖోఖో పోటీలను పాఠశాల సలహా కమిటీ ప్రెసిడెంట్ ఉదయ్ అధ్యక్షతన జరిగింది. పోటీల్లో సీనియర్ (అండర్-17), జూనియర్(అండర్-14) బాలుర విభాగంలో సత్యవేడు మండలం విజేతగా, వరదయ్యపాళెం మండలం ద్వితీయ స్థానంలో నిలిచింది. సీనియర్ బాలికల విభాగంలో వరదయ్యపాళెం మండలం విజేతగా, సత్యవేడు రన్నర్‌గా నిలిచింది. జూనియర్ విభాగంలో వరదయ్యపాళెం మండలం విజేతగా, నారాయణవనం మండలం రన్నర్‌గా నిలిచింది. జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఉపాధ్యక్షులు బందిలకుమార్, కిషోర్, పుత్తూరు డివిజన్ పీఈటీ సంఘ అధ్యక్షుడు భక్తగోపాల్, ఏడు మండలాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్గదర్శకులు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: భారతీయ సంఘ్ నేతగా ఆదర్శ భావాలు కల్గిన పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఉత్తమ మార్గదర్శకులని భాజపా రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ అన్నారు. పట్టణంలోని పాత బస్టాండు కూడలిలో పండిట్ దీన్‌దయాళ్ చిత్రపటాన్ని ఉంచి వేడుకలు నిర్వహించారు. అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. పార్టీ నేతలు సుబ్రహ్మణ్యంరెడ్డి, రమేష్‌బాబు, అమర్‌నాథ్, ఢిల్లీకుమార్, సుకుమార్, వెంకటేశ్వర్లు, లిఖిత్ సాయి, కుమార్, బిందుకుమార్ పాల్గొన్నారు. ● శ్రీరాంనగర్ కాలనీలోని భాజపా కార్యాలయం వద్ద తిరుపతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప నేతృత్వంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాజపా కార్యవర్గ సభ్యురాలు కండ్రిగ ఉమ, ఉమాసింగ్‌తో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.




మిఠాయిలు పంపిణీ చేస్తున్న భాజపా నేత కోలా ఆనంద్ తదితరులు

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించాలి

వరదయ్యపాళెం : తక్కువ వ్యయంతో అధిక దిగుబడి సాధించే అధునాతన సాంకేతిక పద్ధతులను అవలంబించాలని ఏవో ద్వారకానాథ్ కోరారు. మండలంలోని సంతవేలూరు, సాతంబేడు గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. విస్తరణాధికారి ప్రవీణ్, పశుసంవర్ధకశాఖ అధికారి నరేష్, వ్యవసాయ సహాయకులు పవన్, గిర్వాణీ, తెదేపా నాయకులు బాబురెడ్డి, రైతులు పాల్గొన్నారు

కూలీ ధరలు పెంచాలి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పెరిగిన ధరలకు తగ్గట్టు పౌరసరఫరాల గిడ్డంగుల్లో పనిచేసే కార్మికులకు కూలి ధరలు పెంచాలంటూ ఏఐటీయూసీ నేతలు డిమాండ్ చేశారు. పట్టణంలోని సివిల్ పౌరసరఫరాల గిడ్డంగి వద్ద బుధవారం కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ గిడ్డంగుల్లో కూలీ ధరలకు సంబంధించి అగ్రిమెంట్ గడువు ముగిసి తొమ్మిది నెలలు అవుతున్నా ఇప్పటి వరకు నూతన అగ్రిమెంట్ విధానం కొనసాగించకపోవడం శోచనీయమని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గురవయ్య, నేతలు గోపి, శివకుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తులసీరాజ్, శ్రీనివాసులు, అయ్యప్ప, దయాకర్‌నాయుడు, గిరి, రూకేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



సివిల్ సప్లయిస్ గిడ్డంగి వద్ద ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నేతలు

జనం మెచ్చిన ప్రజాప్రభుత్వం

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: వంద రోజుల్లోనే ప్రజలచే మెప్పు పొంది, సంక్షోభంలోనూ సంక్షేమాన్ని, ప్రగతికి బాట చూపిన ఘనత కూటమి పాలనదేనని నియోజకవర్గ పరిశీలకులు, తిరుపతి పార్లమెంటు తెదేపా అధ్యక్షులు డా. శ్రీపతిబాబు అన్నారు. మండలంలోని సీఎల్ఎన్‌పల్లి పంచాయతీ లక్ష్మీపురంలో బుధవారం మండల తెదేపా అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజావేదిక-మంచిప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, తెదేపా నాయకులు పన్నెం నిర్మల్, సుదర్శన్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, జయచంద్రనాయుడు, జనసేన అధ్యక్షుడు చిరంజీవియాదవ్, భాజపా నేతలు కేబీ గురుదేవ్, గుత్తిత్యాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: గురుపూజోత్సవ రోజున డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ స్థాయి పురస్కారాన్ని అందుకున్న గుమ్మడి మురళిని ముక్కంటి ఆలయ ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అభినందించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన్ను దుశ్శాలువతో సత్కరించారు.

చెకుముకి నైపుణ్య పరీక్షలు

రేణిగుంట, న్యూస్‌టుడే: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి నైపుణ్య పరీక్షలను రేణిగుట లోని 10 ప్రభుత్వ, 5 ప్రైవేటు పాఠశాలల్లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి కుప్పస్వామి మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో 8, 9, 10వ తరగతుల నుంచి మొదటి స్థానం వచ్చిన విద్యార్థులు ముగ్గురిని ఒక జట్టుగా చేసి అక్టోబర్ 1వ తేదీన స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించే మండల స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.



ఏరియా ఆసుపత్రిలో ల్యాబొరేటరీ కేంద్రం వద్ద రోగులు

జ్వర నిర్ధారణకు రోగుల పరుగులు

శ్రీకాళహస్తి, తొట్టంబేడు : వర్షాలు.. వాతావరణ మార్పులతో ప్రబలుతున్న విషజ్వరాలు పల్లెలు, పట్టణాలను వణికిస్తున్నాయి. ప్రతి ఇంట్లో జ్వర పీడితుల సంఖ్య పెరుగుతోంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. ముఖ్యంగా డెంగీ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో డెంగీ నిర్ధారణకు ఉపయోగించే కిట్ల కొరతతో రోగులు కలత పడుతున్నారు. దీంతో ఆస్పత్రి వర్గాలు డెంగీ నిర్ధారణ పరీక్షలు అవసరమైన రోగులను ఐదు కిలో మీటర్ల దూరంలోని తొట్టంబేడు పీహెచ్‌సీ పంపుతున్నారు. అంతదూరం వెళ్లేందుకు సౌకర్యం లేని రోగులు సమీప ప్రైవేటు ఆసుపత్రుల బాట పడుతున్నారు. ప్రైవేటు ల్యాబ్‌ల్లో డెంగీ నిర్ధారణకు రూ. 500-600 చెల్లించి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. ఈ విషయంపై ఆస్పత్రి పర్యవేక్షకురాలు విజయలక్ష్మిని వివరణ కోరగా డెంగీ కిట్లు అందుబాటులో ఉన్నాయని, రోగులకు ఎందుకు అందలేదో విచారణ చేస్తామని తెలిపారు.

నీటి లీకులతో ఇక్కట్లు

సత్యవేడు : మండలంలోని రాజగోపాలపురం గ్రామంలోని తాగు నీరు ట్యాంకు పరిసర ప్రాంతాలు అధ్వానంగా తయారయ్యాయి. దీంతో ట్యాంకు లీకేజ్ కారణంగా చుట్టుపక్కల ప్రాంతం పాచిపట్టడంతో ప్రజలు జారిపడుతున్నారు. కాలువల్లోని మురుగు నీరు చేరడంతో దోమలు వృద్ధిచెంది నివాస ప్రాంత వాసులకు నిద్ర కరవైంది. పంచాయతీ సెక్రటరీ రజితను వివరణ కోరగా.. లీకేజీ అరికట్టి, ట్యాంకు చుట్టూ ఉన్న చెత్తాచెదారం తొలిగిస్తామని చెప్పారు.



గుండెపోటుతో ఎమ్మెల్యే సోదరుడి మృతి

నారాయణవనం, న్యూస్‌టుడే: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తమ్ముడు కోనేటి పాండురంగం(68) బుధవారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందారు. నారాయణవనం మండలం భీమునిచెరువు గ్రామానికి చెందిన ఆయన రెండు రోజులక్రితం అస్వస్థతకు గురికావడంతో తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం చికిత్స పొందుతూ గుండెపోటు రావడంతో మృతి చెందారు.



పాండురంగం (దాచిన చిత్రం)

యాచకుడి ..

నాగలాపురం, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్టాండులో యాచకుడు మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. సుదూర ప్రాంతం నుంచి నాగలాపురానికి వచ్చి స్థిరపడ్డ చిదంబరం(75) స్థానికంగా ఉన్న భోజనశాలలో గతంలో పనిచేసేవాడు. వయోభారంతో పనిచేయలేని స్థితిలోని అతను కొన్నేళ్లుగా భిక్షాటన చేసుకుని బస్టాండునే ఆవాసంగా మార్చుకున్నాడు. బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. పంచాయతీ సిబ్బంది అంత్యక్రియలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తొట్టంబేడు, న్యూస్‌టుడే: అతివేగంగా వస్తున్న లారీ ముందు వెళ్తున్న కారు, ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని పెద్దకన్నలి సమీపంలో రేణిగుంట-నాయుడుపేట జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. నాయుడుపేట నుంచి శ్రీకాళహస్తి వైపు అతివేగంగా వెళ్తున్న ఓ లారీ అదుపుతప్పి ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి ఆపై కారుని ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న తొట్టంబేడు ఎస్సీ కాలనీకి చెందిన కృష్ణమూర్తి, మానస గాయాలకు గురయ్యారు. గాయపడ్డ వారిని ఏరియా ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ కొంత దూరం వెళ్లి వాహనం వదిలిపెట్టి పారిపోయాడు. బాధితుల ఫిర్యాదు మేరకు డ్రైవర్ దౌత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

శ్రీకాళహస్తి(గ్రామీణం)(ఏర్పేడు), న్యూస్‌టుడే: రోడ్డుప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడిన ఘటన శ్రీకాళహస్తి మండలంలోని ఈంద్రపల్లి సమీపంలో ఏర్పేడు-వెంకటగిరి ప్రధాన రహదారిపై బుధవారం జరిగింది. గ్రామీణం సీఐ రవినాయక్ కథనం మేరకు.. రోడ్డుపక్కన ఆగి ఉన్న ద్విచక్రవాహనాన్ని మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈఘటనలో కొండయ్య, కృష్ణయ్య ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు క్షతగాత్రులను వైద్యం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

గూడూరు

•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

బ్రాయిలర్	134
లేయర్	115
బ్రాయిలర్స్	240
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	264
లేయర్ మాంసం	195

భూముల పరిశీలన

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: మండలంలోని అక్కరపాక, నెలబల్లి గ్రామాల్లో ఉన్న భూములను బుధవారం సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని స్థానిక తహసీల్దారు శైలకుమారితో కలిసి పరిశీలించారు. కొందరు రైతులు తమ వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చాలని దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి ఈ భూములను పరిశీలించి వివరాలు సేకరించారు.

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: మండలంలోని ఏకొల్లు ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం స్విమ్స్, శ్రీబాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో దొరవారిసత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో కలిసి ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ నెల 27న వేలుబంక, 30న కల్లూరులో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. వైద్యాధికారిణి పద్మావతి, సర్పంచి బ్లెస్సీ, వైద్య సిబ్బంది, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

కంటి అద్దాల పంపిణీ

చిల్లకూరు, న్యూస్‌టుడే: వోమిడి గ్రామంలో బుధవారం జిందాల్ సింహపురి థర్మల్ విద్యుత్కేంద్రం ఆధ్వర్యంలో 150 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. పరిశ్రమ సామాజిక బాధ్యతల్లో భాగంగా వీటిని స్థానిక సర్పంచి లావణ్య ద్వారా అందజేశామని ప్రతినిధులు శ్రీనివాసరావు, శ్రీకాంత్, ఖదీర్ తెలిపారు.



తడ, నాయుడుపేట జట్లతో ఉపాధ్యాయులు

కబడ్డీ విజేత తడ జట్టు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీల్లో తడ జట్టు ప్రథమ స్థానంలో నిలవగా నాయుడుపేట జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. నాయుడుపేట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల్లో బుధవారం కబడ్డీ పోటీలు జరిగాయి.

జిల్లా స్కూల్ గేమ్స్‌కు 450 మంది ఎంపిక

కోట, న్యూస్‌టుడే: కోటలోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలు బుధవారం ముగిశాయి. 450 మంది క్రీడాకారులు ప్రతిభ చూపి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోఆర్డినేటర్ వల్లీఅహ్మద్ పేర్కొన్నారు.

28న అథ్లెటిక్స్ పోటీలు

కోట, న్యూస్‌టుడే: ఉమ్మడి నెల్లూరు జిల్లా అండర్-19 అథ్లెటిక్స్ పోటీలు నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి మైదానంలో ఈ నెల 28వ తేదీన జరుగుతాయని పోటీల కార్యదర్శి శ్రీరేష్ తెలిపారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి

కోట, న్యూస్‌టుడే: కోటలోని భాజపా కార్యాలయంలో బుధవారం పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను భాజపా నాయకులు ఘనంగా నిర్వహించారు. పనబాక కోటేశ్వరరావు, కోటారెడ్డి, రమేష్‌బాబు, వాసు, వెంకటేశ్వర్లు, పరుశురామ్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

● **గూడూరు పట్టణం, న్యూస్‌టుడే:** పట్టణంలోని భాజపా కార్యాలయంలో దీన్‌దయాల్ జయంతి నిర్వహించారు. భాజపా నేతలు బాలకృష్ణంనాయుడు, జీవీనాయుడు, శ్రీనివాసరావు, వెంకటేష్‌యాదవ్, బిందురెడ్డి, నరేంద్ర, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నాయకులు

గిట్టుబాటు ధర కల్పించాలి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, అన్నదాతలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకుడు జోగి శివకుమార్ డిమాండ్ చేశారు. గూడూరు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన చేపట్టారు. కూటమి ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం రూ.20వేలు అందించాలని కోరారు. నాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి విద్యుదీపాలంకరణ



ఆలయం వద్ద అమ్మవారి పాదాలు



చలువ పందిళ్లతో క్యూలైన్ ఏర్పాటు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు, సిబ్బంది

పోలేరమ్మకు మడిభిక్షం పెట్టండి

● ఇంటింటా భక్తుల వేడుకోలు

● భక్తజనంతో కిక్కిరిసిన వెంకటగిరి



మడిభిక్షాలు ఎత్తుతున్న పిల్లలు, యువత

వెంకటగిరి, న్యూస్‌టుడే: పోలేరమ్మ జాతరలో పురస్కరించుకుని ఒక వైపు ఆసాదుల తప్పెట్ల మోతలు.. ప్రతి వీధిలో మడి భిక్షాల జోరు.. పగటి వేషగాళ్ల హడావుడి.. జాతరకు భారీ ఎత్తున తరలివస్తున్న భక్తజన సందోహం.. వెరసి వెంకటగిరి పట్టణంలో బుధవారం ఎటు చూసిన కోలాహలం కనిపించింది. గ్రామశక్తి పోలేరమ్మ జాతర సందడి జోరందుకుంది. బుధ, గురు వారాల్లో రెండు రోజులు పాటు సాగే జాతరలో ఆసాదోళ్ల తప్పెట్లు మోత మారు మోగుతుంది. చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా 'అమ్మకు మడి భిక్షం పెట్టండి.. పోతురాజుకు టెంకాయి కొట్టండి. . పగలకపోతే మా నెత్తిన కొట్టడండి' అంటూ భిక్ష వేయాలని వేడుకుంటారు. దీంతో వీధులన్నీ సందడిగా మారాయి. ప్రతి ఇంటి ముందు మడి భిక్షం బుట్టతో చిన్నారి నుంచి వృద్ధుల వరకు కనిపిస్తున్నారు. పట్టణంలోని ప్రతి ఇంటా పోలేరమ్మ ప్రతిమను తయారు చేసి పూజలు నిర్వహించారు. అంబలి నైవేద్యంగా సమర్పించారు. ఇప్పటికే దూర ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు వెంకటగిరి చేరుకున్నారు. పోలేరమ్మకు సంప్రదాయబద్ధంగా రాజాల నివాసంలో కుమ్మరివారికి సాంగ్యం సమర్పించారు. పగటి వేషగాళ్లు అలరించారు.

1164 మంది పోలీసులతో బందోబస్తు

జాతరకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. పోలీసుల సిబ్బందితో డ్యూటీలపై బుధవారం ఆయన సమీక్షించారు. అదనపు ఎస్పీ, 9 మంది డీఎస్పీలు, 26 మంది సీఐలు, 83 మంది ఎస్సైలు, 288 మంది ఏఎస్సైలు, 430 మంది కానిస్టేబుళ్లు, 58 మంది మహిళా సిబ్బంది, 270 మంది హోమ్‌గార్డులు, 7 స్పెషల్ పార్టీలతోపాటు ఇతర సిబ్బంది విధుల్లో ఉంటారన్నారు.

పాత బస్టాండు నుంచే మూడు క్యూలు

రూ.300కే ప్రత్యేక టికెట్లు

వెంకటగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: గురువారం అమ్మవారిని దర్శించుకునే క్యూలైన్లల్లో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. గ్రామోత్సవాన్ని విజయవంతం చేయడానికి ఏర్పాట్లు ముమ్మరం చేశారు. గురువారం మంత్రి కందుల దుర్గేశ్‌తోపాటు మరో ఇద్దరు మంత్రులు కూడా రావచ్చని ఎమ్మెల్యే కురుగొండ్ల వెల్లడించారు. గతేడాది దర్శన టికెట్లను రూ.500, రూ.200 ధర చేశారు. అంత ఖరీదు భావ్యం కాదని ఈ సారి ఎమ్మెల్యే రూ.300, రూ.100కు కుందించి ఉచిత దర్శనాన్ని కొనసాగించారు. మూడు క్యూలు పాత బస్టాండు నుంచి ప్రారంభమై అమ్మవారి దర్శనానంతరం అక్కడ్నుంచి ఉత్తరం వైపున వెలుపలికి వెళ్లేట్లు బారికేడ్లు అమర్చారు. దర్శనాలు మాత్రం అమ్మవారికి దగ్గరలో వీఐపీ లైన్ తరువాత వరుసగా రూ.300, 100, ఉచిత క్యూలు ఉంటాయి. వీఐపీ క్యూలో మాత్రం దర్శనం అనంతరం అక్కడ్నుంచే వెనుక్కి తిరిగి వెళ్ళొచ్చు.

కౌంటర్లు ఇక్కడే..

ప్రత్యేక టికెట్ల కోసం పాత బస్టాండు, పోలేరమ్మ గుడి, రాజావీధిలో నగరి దగ్గర, పాతకోట ఆంజనేయ స్వామి గుడి ముందు కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు దేవాదాయశాఖ ఈవో అర్వభూమి వెంకటశ్రీనివాసరెడ్డి తెలిపారు.

అలరించిన తెలంగాణ బోనాలు

బుధవారం రాత్రి వరదరాజులు స్వామి ఆలయం నుంచి తెలంగాణ బోనాలను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రారంభించారు. పట్టణవీధుల్లో బోనాలు ఎత్తిన మహిళల నృత్యప్రదర్శనలు ప్రత్యేకాక్షరణగా నిలిచాయి. దారి పొడవునా వీరి ప్రదర్శన తిలకించేందుకు ప్రజలు వేచి ఉన్నారు.



మేమున్నాం.. మీకు తోడుగా..

గూడూరు : 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 96188 78782
వెంకటగిరి : 80085 73966
సమయం 10 AM TO 1 PM

కోట, న్యూస్‌టుడే:

సమస్య: కోట పంచాయతీ పరిధిలోని శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీకి సంబంధించిన శ్మశానవాటికలో చేతి పంపు ఏర్పాటు చేయాలి. అంత్యక్రియలకు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం. ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోలేదు. **- బాబు, స్థానికుడు**

సమాధానం: పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. **-హేమంత్, ఏఈ**

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే:

సమస్య: గూడూరు రెండో పట్టణం ఇందిరానగర్ ప్రాంతంలో కాలువల్లో మురుగు ముందుకు కదలడం లేదు. **- ప్రభాకర్, స్థానికుడు**

సమాధానం: పూడిక తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- వెంకటేశ్వర్లు, పురపాలక కమిషనర్**

విద్యుత్తు నియంత్రిక మరమ్మతు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: విన్నమాల వద్ద పొలాల్లో వాలిన విద్యుత్తు నియంత్రికను ఆ శాఖ అధికారులు బాగు చేశారు. ఇటీవల 'ఈనాడు'లో వచ్చిన వార్తకు ఈ మేరకు వారు స్పందించారు.

స్పందనకు వందనం



సతీశ్ ధవన్ విగ్రహానికి నివాళి అర్పించిన సంచాలకులు, శాస్త్రవేత్తలు

సతీశ్ ధవన్ జయంతి వేడుకలు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) మాజీ అధిపతి ప్రొఫెసర్ సతీశ్ ధవన్ జయంతి వేడుకలను శ్రీహరికోటలోని షార్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. షార్‌లోని జీరో పాయింట్‌లో ఉన్న ఆయన విగ్రహానికి సంచాలకులు ఆర్ముగం రాజరాజన్, నియంత్రణ, విజిలెన్సు అధికారి శ్రీనివాసులురెడ్డి, తదితరులు పుష్పాంజలి ఘటించారు. సూళ్లూరుపేటలోని సతీశ్ ధవన్ స్మారక ఆసుపత్రిలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. 123 మంది రక్తదానం చేశారు. షార్ అసోసియేట్ డైరెక్టర్ సయ్యద్ హమీద్, ఎంఎస్‌ఏ గ్రూపు డైరెక్టర్ పి.గోపీకృష్ణ, డిప్యూటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో వాకాడు ఆలయాల ఆస్తులు

వాకాడు, న్యూస్‌టుడే: వాకాడులోని శివాలయం, అలఘనాథస్వామి, శ్రీ కోదండరామస్వామి ఆలయాల ఆస్తులు, పొలాల వివరాలను ఇకపై ఆన్‌లైన్‌లో ఉంచుతున్నట్లు ఆలయ ఈవో నవీన్ పేర్కొన్నారు. బుధవారం ఆయన ఆలయాలను సందర్శించి అక్కడి విగ్రహాలు, ఇతర సామగ్రి, ఆలయంలో మూలవిరాట్టుల కొలతలు, వాటిపై ఉన్న ఆభరణాల వివరాలను నమోదు చేసుకున్నారు.

గ్రూపు ఆలయాల ఈవోగా రవికృష్ణ

నాయుడుపేట, న్యూస్‌టుడే: గ్రూపు ఆలయాల ఈవోగా ఎం.రవికృష్ణ నియమితులయ్యారు. బాపట్ల జిల్లా యజిలి గ్రూపు ఆలయాల గ్రేడ్-2 ఈవోగా ఉన్న ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జి ఈవోగా ఉన్న శశాంక్ కోట ఆలయాల గ్రూపు ఈవోగా కొనసాగనున్నారు.

శ్రీశ్రీశ్రీ వెంకటగిరి పోలేరమ్మ జాతర శుభాకాంక్షలతో.. ADVT SPECIAL FEATURE

విత్తనశుద్ధి తప్పనిసరి

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: రైతులు విధిగా విత్తన శుద్ధి చేసుకోవాలని, అప్పుడే తెగుళ్ల బారి నుంచి పంటలను కాపాడుకోవచ్చని వ్యవసాయాధికారిణి కవిత సూచించారు. సుద్దమడుగు తాగేలి, మంగానెల్లూరు గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు.



నాయుడుపేటలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

● **నాయుడుపేట, న్యూస్‌టుడే:** పుదూరు గ్రామంలో ఏవో గణేష్ విత్తన శుద్ధి విధానం గురించి రైతులకు ప్రయోగాత్మకంగా వివరించారు. ఉద్యానశాఖ అధికారి శారద, వీఏవో చెంగల్‌రాజు, రైతులు పాల్గొన్నారు.

● **తడ, న్యూస్‌టుడే:** చేనిగుంట, గ్రద్దగుంట గ్రామాల్లో వ్యవసాయాధికారి కాంచన రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు భారతి, పశు సంవర్ధక సహాయకులు ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

● **కోట, న్యూస్‌టుడే:** కొక్కుపాడు, వంజివాకల్లో అధికారులు, వ్యవసాయ సిబ్బంది 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి నిరంజన్‌కుమార్, మత్స్యశాఖ అధికారి రెడ్డ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.



దారుణంగా గూడలి రోడ్డు

కోట, న్యూస్‌టుడే: కోట మండలం విద్యానగర్-గూడలి మార్గంలోని ర.భ రోడ్డు గుంతలమయమై అధ్వానంగా ఉంది. వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిస్తే గుంతల్లో నీరు నిల్వ ఉంటోంది. ఆదమరిస్తే వాహనచోదకులు ప్రమాదాలకు గురౌతున్నారు. అధికారులు మరమ్మతులకు ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నా ఫలితం లేదు. ఈ విషయమై ర.భ అధికారులు స్పందిస్తూ.. నిధులు మంజూరైన వెంటనే మరమ్మతు చేస్తామని అంటున్నారు.

ఆగని మట్టి దందా

● పెళ్లకూరులో పెద్దఎత్తున అక్రమ తవ్వకాలు
● ఛిద్రమవుతున్న చెరువులు, భూములు



వరుస కట్టిన మట్టి ట్రాక్టర్లు

పెళ్లకూరు, న్యూస్‌టుడే: మండలంలో మట్టి తవ్వకాలు ఇబ్బడిముబ్బడిగా చేస్తున్నారు. అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా తవ్వి తరలిస్తున్నారు. జాతీయ రహదారి పేరిట అనుమతులు గోరంత తీసుకుని కొండంతగా తవ్వకాలు చేస్తున్నారు. ఇదే తీరుగా అక్రమార్కులు చెలరేగి స్థిరాస్తి క్షేత్రాలకు తరలిస్తున్నారు. తాజాగా ఇటుక బట్టీల పేరుతో మట్టి పెద్దఎత్తున తరలిస్తున్నారు. స్థానికులు అడ్డుకుంటున్నా లెక్క చేయడంలేదు. ఇందుకు పార్టీలను పక్కన పెడుతున్న నేతలు అంతా ఒక్కటవుతున్నారు.

చెంబడిపాళెంలో ఇటుక బట్టీలకు మట్టి తరలిస్తున్న సుమారుగా 20 ట్రాక్టర్లను బుధవారం స్థానికులు అడ్డుకున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా ఎలా తరలిస్తారని ప్రశ్నించి.. అధికారులకు ఫిర్యాదు చేశారు. గంటకు పైగా హైడ్రామా నడిచింది. అదేవిధంగా చెంబేడు చెరువులో గ్రావెల్‌ను పెద్దఎత్తున తవ్వేస్తున్నారు. చెరువు మరమ్మతుల పేరిట అనుమతి తీసుకుని బయటకు తరలిస్తున్నారు.

యంత్రాలతో కుతంత్రాలు

యంత్రాలు ఏర్పాటు చేసుకున్న కొందరు అక్రమార్కులు పార్టీ ఏదైనా నేతల దగ్గర వాలిపోతున్నారు. అన్నీ తామై వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం వారి కనుసన్నల్లో తవ్వకాలు చేస్తున్నారు. పెద్ద సంఖ్యలో టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. నాయుడుపేట తదితర ప్రాంతాల్లో స్థిరాస్తి క్షేత్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. సీఎన్‌పేట చెరువు నుంచి ఇదే తీరుగా గ్రావెల్, మట్టి తరలిపోతూనే ఉంది. గతంలో పనిచేసిన అధికారులు ఇంకా ఉండటంతో అక్రమార్కులకు వంతు పాడుతున్న పరిస్థితి ఉంది. దీనిపై తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డిని వివరణ కోరగా అక్రమ తవ్వకాలు అడ్డుకుంటామన్నారు.

శ్రీశ్రీశ్రీ వెంకటగిరి పోలేరమ్మ జాతర శుభాకాంక్షలతో..

ADVT SPECIAL FEATURE



మంచి ప్రభుత్వానికి సహకారమందించాలి



పునబాకలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, వేదికపై కూటమి నేతలు

పెళ్లకూరు, న్యూస్‌టుడే: ఆర్థిక కష్టాలున్నా పేదలను ఆదుకుంటున్న కూటమి ప్రభుత్వానికి ప్రజల సహకారం మెండుగా ఉండాలని శాసన సభ్యురాలు నెలవల విజయశ్రీ కోరారు. పునబాకలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్న ఆమె సంక్షేమం, అభివృద్ధి పథకాల గురించి వివరించారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డి, భాజపా నాయకుడు ఎద్దల నరేంద్రరెడ్డి, నాయకులు చైతన్యకృష్ణారెడ్డి, నాగేంద్రరెడ్డి, రామకృష్ణయ్య, హరినాయుడు, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు. ● **నాయుడుపేట, నాయుడుపేట పట్టణం:** పట్టణంలో ఇంటింటా తిరిగి ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను తెలుగు యువత పార్లమెంటు ఉపాధ్యక్షుడు అవధానం సుధీర్ పంపిణీ చేశారు. నాయకులు కాటంరెడ్డి వెంకటేశ్వర్లు రెడ్డి, హరినాయుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గూడూరుకు రెండు పూటలా తాగునీరు

గూడూరు పట్టణం, వాకాడు, న్యూస్‌టుడే: పుర ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా రెండు పూటలా నీరు సరఫరా చేసేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ చెప్పారు. రెండో పట్టణం ఎస్ఆర్‌పి టాకీస్ ప్రాంతంలోని బీసీ కాలనీ వద్ద ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండో పట్టణానికి చెందిన తెదేపా నేతలు బిల్లు చెంచురామయ్య, ఇస్రాయిల్, రహీమ్‌లు రూ.లక్ష, కోట మండలం కొత్తపట్నంకి చెందిన సాగర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి రూ.లక్ష చెక్కు వరద బాధితుల సహాయార్థం ఎమ్మెల్యేకు అందజేశారు. కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌కు రూ.లక్ష చెక్కు అందిస్తున్న జనార్దన్‌రెడ్డి, సాగర్‌రెడ్డి



రోడ్డు తవ్వకంపై వివాదం

పెళ్లకూరు : పెళ్లకూరు మండలం శిరసనంబేడులోని అవుట్ రోడ్డు తవ్వేయడంపై దుమారం రేగుతోంది. ఇక్కడ గ్రామంలోని ర.భ రోడ్డు అనుసంధానంగా గ్రామస్థుల పట్టా స్థలాల్లో పదేళ్ల కిందట రహదారి ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో వాహనాలు రాకపోకలు చేసేవి. బుధవారం స్థానికులు రోడ్డు మార్గం తవ్వేయడంతో అమ్మన్ ట్రై సంస్థ ప్రతినిధి రాజేష్ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇలా గ్రామస్థులు, కంపెనీ మధ్య వివాదం నడుస్తోంది.





పరీక్షకు హాజరైన విద్యార్థులు

చెకుముకి పరీక్ష

తడ, న్యూస్‌టుడే: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తడ జడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో బుధవారం నిర్వహించిన పాఠశాల స్థాయి చెకుముకి సైన్సు ప్రతిభ పరీక్షకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు సురేష్, శ్రీనివాసులు ప్రశ్నపత్రాలను విడుదల చేసి విద్యార్థులకు అందించారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ఎస్.చెంగయ్య, సైన్సు ఉపాధ్యాయులు కరుణ, నాగదేవి, వేమయ్య తదితరులు పాల్గొన్నారు.



























